ప్రజాశక్తి




శుక్రవారం 21 ఫిబ్రవరి 2025 8 పేజీలు

గుంటూరు పల్నాడు

ఢిల్లీని తాకిన మిర్చి ఘాటు

- నేడు వాణిజ్య, వ్యవసాయ శాఖాధికారుల భేటి
- రైతులకు సాయంపై సందిగ్ధం
- సాగు ఖర్చు అంచనాలపై తేలని గణాంకాలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు మిర్చి ఘాటు ఢిల్లీని తాకింది. బుధవారం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మిర్చి యార్డు సందర్శన నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో కదలిక వచ్చింది. రెండు నెలలుగా సిఎం చంద్రబాబు కేంద్రానికి లేఖలు రాసినా ఒక్కసారి కూడా రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో కేంద్ర అధికారులు చర్చలు జరపలేదు. రైతులను ఎలా ఆదుకోవాలే అనే అంశంపై కేంద్రం దృష్టి సారించలేదు. జగన్ పర్యటన నేపథ్యంలో బుధవారమే సిఎం చంద్రబాబు కేంద్రానికి మరోసారి లేఖ రాసినట్టు వార్తలు వచ్చాయి. అంతేగాకుండా గురువారం ఢిల్లీ వెళ్లిన చంద్రబాబు కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ అందుబాటులో లేకపోవడంతో ఆయనతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమస్య తీవ్రతను వివరించారు.



ఢిల్లీలో వ్యవసాయాధికారులతో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు.. సమావేశంలో మంత్రులు రామ్మోహన్‌నాయుడు, చంద్రశేఖర్



కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి కార్యాలయంలోనే సిఎం చంద్రబాబు, రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు రామ్మోహననాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, నరసరావుపేట ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయులు కలిసి అధికారులతో చర్చించారు. సిఎం చంద్రబాబు సూచనల మేరకు వ్యవసాయ శాఖ మంత్రి శివరాంసింగ్ చౌహాన్ ఆదేశాలతో శుక్రవారం కేంద్ర వాణిజ్య, వ్యవసాయ శాఖ అధికారులు ఢిల్లీలో భేటి కానున్నారు.

మార్కెట్ ఇంటర్ వెన్షన్ స్కీం కింద మద్ధతు ధర కన్నా తక్కువ ఉంటే సగటు ధరలో 25 శాతం సాయం అందించే అవకాశం ఉందని అధికార వర్గాలు తెలిపాయి. అయితే మిర్చికి కేంద్ర ప్రభుత్వం మద్ధతు ధర ప్రకటించలేదు. గత వైసిపి ▶ 2లో

చిట్, టౌన్‌షిప్ వివాదాలపై సిట్

బాపట్ల ఎస్పీ తుషార్ దూడి నేతృత్వంలో ఏర్పాటు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



సాయిసాధన చిట్‌ఫండ్స్, విజయలక్ష్మి టౌన్‌షిప్ ఆర్థిక వివాదాలపై విచారణకు ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను నియమించింది. ఇందులో గతంలో గుంటూరు ఎస్పీగా పని చేసిన ప్రస్తుత బాపట్ల జిల్లా ఎస్పీ తుషార్ డూడి, రేపల్లె డిఎస్‌పి శ్రీనివాసులు, మాచర్ల రూరల్ సిఐ హఫీజ్‌బాషా మరికొందరు సభ్యులుగా ఉన్నారు. సాయిసాధన చిట్‌ఫండ్స్ ఎమ్‌డి, విజయలక్ష్మి టౌన్‌షిప్ సంస్థల భాగస్వామి అయిన పాలడుగు పుల్లారావు రూ.100 కోట్లకు పైగా ప్రజల నుంచి పెట్టుబడి, చిట్టీల రూపేణా డబ్బులు తీసుకొని ఉడాయించాడు. బాధితులు గుంటూరులోని పట్టాభిపురం పోలీస్‌స్టేషన్‌లో, నరసరావుపేట వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం, ఇది రాష్ట్ర వ్యాప్తంగా సంచలన కావడంతో పుల్లారావు, గుంటూరు కోర్టులో లొంగిపోయాడు. ప్రస్తుతం ఆయన రిమాండ్‌లో ఉండగా టౌన్‌షిప్‌లో మరో భాగస్వామి అయిన గుండా సాంబశివరావు ఇంకా పరారీలో ఉన్నాడు.

నేడు చికెన్, గుడ్డు ఫుడ్ మేళా

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక పట్టాభిపురం, స్వామి థియేటర్ గ్రౌండ్‌లో శుక్రవారం సాయంత్రం 5 గంటలకు చికెన్, కోడిగుడ్ల వినియోగంపై అవగాహన సదస్సు, చికెన్, ఎగ్‌ఫుడ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా పశుసంవర్థక శాఖ అదికారి డాక్టర్ ఓ.నరసింహారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో కోళ్ల ఫారాలలో బర్డ్‌ఫ్లూపై వస్తున్న వదంతుల వల్ల ప్రజలు కోడి మాంసం, గుడ్లు తినటానికి భయపడుతున్నారని, ఇది ఒక అపోహ మాత్రమేనని పేర్కొన్నారు. కోడిగుడ్లు, మాంసం బాగా ఉడికించి తినటం వల్ల ఎటువంటి హానీ ఉండదని తెలిపారు. ఈ విషయంపై అవగాహన కోసం జిల్లా ఫార్మర్స్, ట్రేడర్స్ అసోసియేషన్ నిర్వహిస్తున్న సదస్సు, విందుకు ప్రజలు హాజరు కావాలని కోరారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు : కలెక్టర్

మాదకద్రవ్యాలను అరికట్టేందుకు విద్యాసంస్థల్లో కమిటీలు

-8- పే



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జనార్ధనరావు, సిఐ మల్లికార్జునరావు... వెనక ముసుగుల్లో నిందితులు

ఐదుగురు గంజాయి విక్రేతలు అరెస్టు

నిందితుల నుంచి నాలుగు కిలోల సరుకు స్వాధీనం

ప్రజాశక్తి - తెనాలి

స్థానిక వైకుంటపురం రైల్వే బ్రిడ్జి సమీపంలో గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారంతో వన్‌టౌన్ సిఐ వి.మల్లికార్జునరావు సిబ్బందితో దాడి చేశారు. దీనిపై వివరాలను డీఎస్పీ బి.జనార్ధనరావు గురువారం స్థానిక వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో విలేకర్లకు వెల్లడించారు. బ్రిడ్జి సమీపంలో వల్లభాపురానికి చెందిన ఆరుమళ్ళ సాహిత్‌రెడ్డి అలియాస్ విక్కీ బాయ్, రెడ్డిబత్తుల హర్షవర్ధన్‌రెడ్డి అలియాస్ హర్ష, పాముల రిషిబాబు అలియాస్ పెద్దచోటు, పట్టణంలోని రామలింగేశ్వరపేటకు చెందిన ఎర్రమోతు పవన్ ప్రశాంత్ అలియాస్ పిల్లు, నాజర్‌పేటకు చెందిన పసుపులేటి వెంకటేశ్వరరావు అలియాస్ ఆదికే ను అరెస్టు చేశారు. వీరి నుంచి నాలుగు 4 కిలోల 50 గ్రాముల గంజాయిని, రూ.4500ను స్వాధీనం చేసుకున్నారు. సిఐతోపాటు సిబ్బందిని ఎస్పీ సతీష్ కుమార్ అభినందించినట్లు డీఎస్పీ చెప్పారు.

గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

ప్రజాశక్తి-గుంటూరు

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీసు కమిషన్ ఈనెల 23న నిర్వహిస్తున్న గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలు సజావుగా కొనసాగేలా సంబంధిత అధికారులు సమర్ధవంతంగా విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్‌లు ఇతర శాఖల అధికారులతో కలెక్టరేట్‌లో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రూప్-2 సర్వీసెస్ ఉద్యోగాల నియామకానికి సంబంధించిన మెయిన్స్ పరీక్ష ఆదివారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్-1, మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 5.30 గంటల వరకూ పేపర్-2 పరీక్ష ఉంటుందన్నారు. జిల్లాలోని 11 పరీక్షా కేంద్రాల్లో 9,277 మంది అభ్యర్థులు హాజరవుతు న్నారన్నారు. ప్రతి పరీక్షా కేంద్రానికి ఒక్కొక్కరు చొప్పున సీనియర్ జిల్లా అధికారులను లైజను ఆఫీసర్లుగా నియమించినట్లు చెప్పారు. పరీక్ష సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని, పరీక్ష వేళలకు అనుగుణంగా కేంద్రాలకు బస్సులు నడపాలని, పరీక్ష కేంద్రాల వద్ద మెడికల్ క్యాంప్‌ల ఏర్పాటు చేయాలని అధికారుల్ని ఆదేశించారు. సమావేశంలో సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ, డిఆర్‌ఒ ఎన్.ఎస్.కె ఖాజావలి, ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరీ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.




గుంటూరు, నరసరావుపేటలో సమీక్షల్లో మాట్లాడుతున్న కలెక్టర్లు నాగలక్ష్మి, అరుణ్‌బాబు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

గ్రూప్-2 పరీక్షల నిర్వహణపై రాష్ట్ర సచివాలయం నుండి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించగా నరసరావుపేటలోని కలెక్టరేట్ నుండి పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎస్పీ కె.శ్రీనివాస్, జెసి సూరజ్ ధనుంజయ్, డిఆర్‌ఒ మురళి హాజరయ్యారు. పదో తరగతి, ఇంటర్ పరీక్షల నిర్వహణపై మాట్లాడినా నంతరం పి-4 సర్వేపైనా సమీక్షించారు. వాట్సాప్ గవర్నెన్స్‌పై ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన కల్పించేలా కలెక్టరేట్‌లో ప్రత్యేకమైన సెల్‌తో పాటు రైల్వే, బస్ స్టేషన్లలో, ప్రధాన కూడళ్లలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు.



రీజినల్ మేనేజర్ నుండి శాంక్షన్ లెటర్ అందుకుంటున్న మహిళలు

యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో మహిళలకు మెగా రుణమేళ

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

యూనియన్ బ్యాంక్ ప్రత్తిపాడు ఆధ్వర్యంలో ఎస్ హెచ్ జి రుణ మేళ ప్రత్తిపాడు మేనేజర్ సీత రామ్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా గుంటూరు రీజినల్ మేనేజర్ సయ్యద్ జవహర్ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా పురోగతి సాధించాలని వారి కోసం వ్యక్తి గత ,వ్యాపార, పలు రకాల రుణాలు మహిళలకు అందుబాటులో ఉన్నాయన్నారు. మహిళలు రుణాలు పొంది ఆర్థిక పురోగతి సాధించాలన్నారు. మేనేజర్ సీతా రామ్ మాట్లాడుతూ మహిళలు కావాల్సిన రుణాలు పొందాలంటే సంబంధిత పత్రాలు తీసుకొని వస్తే వారికి కావాల్సిన రుణాలు మంజూరు చేయడం జరుగుతుంది అన్నారు. కార్యక్రమం అనంతరం మహిళలకి రీజినల్ మేనేజర్ చేతుల మీదుగా సాంక్షన్ లెటర్ అందచేయడం జరిగింది ఈ కార్యక్రమం లో ఏపియం లాజర్,డ్వాక్రా యనిమెటర్లు ,మహిళలు బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర బడ్జెట్‌లో చేనేతకు రూ.2వేల కోట్లు కేటాయించాలి

ప్రజాశక్తి - మంగళగిరి

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం 25 తేదీన ప్రవేశపెట్టనున్న రాష్ట్ర బడ్జెట్లో చేనేత రంగానికి రూ.2 వేల కోట్లు నిధులు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరావు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళగిరిలోని రాష్ట్ర చేనేత కార్మిక సంఘం కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో నాగేశ్వరావు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ప్రతిపక్షంలో ఉన్న తెలుగుదేశం పార్టీ చేనేత రంగానికి రూ.1500 వందల కోట్ల బడ్జెట్లో నిధులు కేటాయించాలని కోరడం జరిగిందన్నారు. అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం మొదటి సారీ బడ్జెట్లో కేవలం రూ.200 కోట్లు మాత్రమే కేటాయించటం దారుణం అన్నారు.1.65 లక్షల మంది ప్రత్యక్షంగా పరోక్షంగా సుమారు 3 లక్షల మంది చేనేత రంగంపై ఆధార ఉండటంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 7 లక్షల మంది జనాభా గలిగిన చేనేతలకు తగిన విధంగా బడ్జెట్లో కేటాయింపులు ఉండాలని నాగేశ్వరరావు కోరారు. చేనేత సహకార సంఘాలకు బకాయిలు ఉన్న 172 కోట్ల రూపాయలను వెంటనే విడుదల చేయాలని, చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని నేతల నేస్తం పథకాన్ని రూ.24 వేల నుండి రూ.36 వేలకు పెంచి ఇవ్వాలని పిల్లలమర్రి నాగేశ్వరావు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గజవల్లి వెంకట కష్ణారావు, ఉపాధ్యక్షులు ఈ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలపాటిని గెలిపించాలని గొట్టిపాటి ప్రచారం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఈ నెల 27 న జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో టిడిపి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపే లక్ష్యంగా పని చేయాలని పల్నాడు జిల్లా ఇంచార్జ్ - రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అన్నారు. నరసరావుపేట నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో గురువారం ఉమ్మడి కృష్ణ-గుంటూరు జిల్లాల ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ ఎన్నికల సమీక్షా సమావేశం నిర్వహించారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ పట్టభద్రుల ఓటర్ల ఇంటింటి విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. సమస్యలు ఏమైనా ఉంటే టిడిపి కార్యాలయంలో తెలియజేయాలన్నారు. ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాజీ మంత్రిగా ఎన్నో విశిష్ట సేవలు అందించారని ఇంజనీరింగ్ కళాశాలలు నెలకొల్పడానికి అయన విద్య శాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఎంతో కృషి చేశారన్నారు. కూటమి ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనకు 16 వేల పోస్టులతో మెగా డి.ఎస్.సి నిర్వహించారన్నారు. కూటమి అభివృద్ధి, సంక్షేమ పథకాలు కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజా కు ఓటు వేసే విధంగా ప్రతి ఒక్క గ్రాడ్యుయేట్ ఓటరును అభ్యర్థించాలన్నారు. కార్యక్రమంలో నరసరావుపేట పరిశీలికులు మన్నవ మోహన్ కృష్ణ, కూటమి నేతలు క్లస్టర్ యూనిట్ బూత్ కన్వీనర్లు కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.

ఢిల్లీని తాకిన మిర్చి ఘాటు

మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వం కేవలం రూ.7 వేలు ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఎంత సాయం రైతులకు అందించాలనే అంశం పై కేంద్ర ప్రభుత్వ అధికారులు ఇంత వరకు ఒక అంచనాకు రాలేకపోయారు. మిర్చి సాగుకు సగటు పెట్టుబడిని పరిగణలోకి తీసుకున్నా ఎక్కువ మంది రైతులు రూ.లక్షన్నర నుంచిరూ.2 లక్షల వరకు ఖర్చు అవుతుందని చెబుతున్నారు. కేంద్ర వ్యవసాయ ధరల సూచిక ప్రకారం ఇప్పటి వరకు మిర్చి సాగుకు పెట్టుబడి సగటున ఎంత వుంటుందనే అంశంపై ఇంకా స్పష్టమైన గణాంకాలపై స్పష్టత లేదు. సాగు ఖర్చులను వాస్తవ ధృక్పథంతో లెక్కలు వేసి ధరలు నిర్ణయించాలని అవన్నీ సరిచేయాలని కేంద్రమంత్రిని కోరామని సిఎం చంద్రబాబు ఢిల్లీలో ప్రకటించారు. ధరల స్థిరీకరణ కోసం ఏం చేయాలో రాష్ట్ర ప్రభుత్వం తరపు నుండి కూడా ఆలోచిస్తామన్నారు. ఇతర దేశాలకు మిర్చి ఎగుమతులపై కూడా కేంద్రం దృష్టి సారించాలని కోరారు. దీంతో శుక్రవారం జరిగే సమావేశంపై తమకు ఎలాంటి సాయం ప్రకటిస్తారోనని రైతులు ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు.

ప్రజానేత లక్ష్మణరావును గెలిపించుకుందాం

ప్రజాశక్తి- తాడేపల్లి : ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు తో పాటు అన్ని వర్గాల సాధారణ ప్రజల ప్రయోజనాల కోసం పనిచేసే పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె ఎస్ లక్ష్మణరావు అత్యధిక ఓట్ల మెజారిటీతో గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పాశం రామారావు చెప్పారు. గురువారం రాత్రి తాడేపల్లి మేక అమరా రెడ్డి భవన్లో ప్రజా సంఘాల విస్తృత సమావేశం సిఐటియు నాయకులు వేముల దుర్గారావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ 14 సంవత్సరాలు పిడిఎఫ్ ఎమ్మెల్సీగా నిబద్ధతతో పనిచేసిన లక్ష్మణ్ రావ్ లాంటి వ్యక్తిని గెలిపించుకొని పెద్దల సభకు వన్నె తేవాలని కోరారు. పేదలుఎదుర్కొంటున్న ఇళ్ల స్థలాలు, ఇళ్ల పట్టాలు కోసం కృషి చేశారని వివరించారు. కార్యక్రమంలో నాయకులు బూరుగ వెంకటేశ్వర్లు, కొట్టే కరుణాకర్ రావు, కె గడ్డన్న, ఏ జగన్, వై బర్నబాస్, ఎం శ్రీనివాస్ రెడ్డి, ఎల్ సత్యం, బి రామారావు, కె మేరీ, బి గోపిరెడ్డి, వి శాస్త్రి, డి దేవకుమార్, కొండబాబు తదితరులు పాల్గొన్నారు.



తాడేపల్లి సమావేశంలో మాట్లాడుతున్న పాశం రామారావు

ప్రజాశక్తి-ప్రత్తిపాడు : పిడిఎఫ్ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావు గెలుపు కోరుతూ ప్రత్తిపాడు ఎస్ ఎఫ్ ఐ నాయకులు భారత్ చంద్, పవన్ ప్రత్తిపాడు మండల పరిధిలోని కొండ జగర్ల మూడి , తుమ్మల పాలెం, యనమదల గ్రామాలలో ప్రచారం నిర్వహించారు.



ప్రత్తిపాడు మండలంలో ప్రచారం

వేదా సీడ్స్ వితరణ

ట్రాఫిక్ పోలీసులకు మైక్‌సెట్ అందచేత

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ పోలీసులకు మైక్ ఎనౌన్స్ మెంట్ పరికరాలను వేదా సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ తులసి ధర్మచరణ్ గురువారం అంద చేశారు. బృందావన్ గార్డెన్స్, ఎన్‌టిఆర్ స్టేడియం కూటలి సిగ్నల్స్ వద్ద ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనను నివారించేందుకు ఈ పరికరాలను ట్రాఫిక్ ఎస్ఐ శ్రీహరికి అందించారు. ర్యాష్ డ్రైవింగ్ వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని వీటి నివారణకు పోలీసులు తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయని ధర్మచరణ్ తెలిపారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో శంకర్ నాయక్, రంగారావు, తేలప్రోలు వెంకటరావు, గాజుల సాయిరాం పాల్గొన్నారు.





ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావు

కోటప్పకొండ తిరునాళ్ల ఏర్పాట్లపై ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పరిశీలన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మహాశివరాత్రి సందర్భంగా ఈనెల 26న జరిగే తిరునాళ్లకు కోటప్పకొండ ముస్తాబవుతోంది. కోటప్పకొండ తిరునాళ్ల రాష్ట్ర పండుగ అయిన నేపథ్యంలో సందర్శకులకు ఇబ్బందులేమీ రాకుండా ఏర్పాట్లను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు పర్యవేక్షిస్తున్నారు. సిఎం చంద్రబాబు హాజరయ్యే అవకాశం ఉందన్నారు. గిరి ప్రదర్శన, రోడ్లు మరమ్మతులు, వాటర్ ప్లాంట్ల నిర్మాణం రోప్ వే ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. ఏర్పాట్లపై కలెక్టర్‌తోపాటు ఎస్పీ, ఇతర అధికారులు ఎప్పటికప్పుడు ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు.

నేడు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

ప్రజాశక్తి - ఎఎన్‌యు : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ వేడుకలకు సంబంధించి ఆర్ట్స్, కామర్స్, లా కళాశాల విద్యార్థులకు గురువారం వ్యాసరచన, వక్తృత్వం పోటీలను నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు శుక్రవారం మధ్యాహ్నం తెలుగు విభాగంలో జరిగే వేడుకల్లో బహుమతి ప్రధానోత్సవం చేయనున్నారు.

బడ్జెట్‌లో పల్నాడుకు ప్రాధాన్యమివ్వాలి

నేడు సిపిఐ కార్యాలయంలో అఖిలపక్ష సమావేశం

ప్రజాశక్తి- మాచర్ల : ఈనెల 24న ప్రారంభం కానున్న బడ్జెట్ సమావేశాల్లో వెనుకబడిన పల్నాడు ప్రాంత వాసులకు కలగా మిగిలిన వరకపూడిసెల ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు కేటాయించి, వెంటనే పనులు ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ స్థానిక సిపిఐ కార్యాలయంలో శుక్రవారం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయనున్నట్టు సిపిఐ మాచర్ల ఏరియా కార్యదర్శి మేకపోతుల శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్న సమావేశానికి అన్ని రాజకీయ పార్టీల నాయకులు హాజరుకావాలని ఆయన కోరారు.

ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి

హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే రూ.వెయ్యి జరిమాన : ఎస్‌పి

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో రహదారులపై ప్రమాదాలు జరుగుతున్న బ్లాక్ స్పాట్ ప్రాంతాలను గుర్తించి వాహనాల ప్రమాదాలు జరగకుండా అక్కడ అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ అధికారులను ఆదేశిచారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, నగర కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి జిల్లాస్థాయి రహదారి భద్రత కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారులు, ఆర్ అండ్‌బి, పంచాయితీ, మున్సిపల్ అధికారులతో రవాణా, పోలీస్ అధికారులు సంయుక్తంగా రహదారులను తనిఖీ చేసి బ్లాక్ స్పాట్‌లపై 15 రోజుల్లో నివేదిక అందించాలన్నారు. తనిఖీలలో గుర్తించిన అంశాల మేరకు బ్లాక్ స్పాట్ ప్రాంతాలలో రహదారుల విస్తరణ, మరమ్మత్తు, సైన్ బోర్డు, వేగ నియంత్రణ తదితర చర్యలు సంబంధిత రహదారుల ఇంజనీరింగ్ అధికారులు తీసుకోవాలన్నారు. జాతీయ రహదారి సర్వీస్ రోడ్డులోనే ఆటోలు, ద్విచక్ర వాహనాలు ప్రయాణించేలా వాహనదారులకు అవగాహన కల్పించాలన్నారు. ద్విచక్ర వాహనదారులు ఖచ్చితంగా హెల్మేట్ ధరించేలా తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. జిల్లాలో గుంతల రహిత రహదారుల కోసం ఆర్ అండ్ బీ, మున్సిపల్ రహదారులకు మంజూరు చేసిన పనులు సత్వరమే పూర్తి చేయాలన్నారు. గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ట్రాఫిక్ రద్దీ నివారణ, రహదారి ప్రమాదాలను అరికట్టేందుకు పోలీస్ శాఖ సూచించిన విధంగా ముఖ్య కూడళ్ళలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు, జీబ్రా లైన్ల మార్కింగ్, వేగ నియంత్రికల పనులు మున్సిపల్ అధికారులు వెంటనే పూర్తి చేయాలన్నారు. వ్యాపార సంస్థల సెల్లార్లలోనే వాహనాలు పార్కింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. శంకర్ విలాస్ వద్ద నూతన బ్రిడ్జ్ నిర్మాణ నేపథ్యంలో ట్రాఫిక్ మళ్ళింపు కోసం పోలీస్ శాఖప్రతిపాదించిన రహదారుల విస్తరణ, మరమ్మతులు పనులను మున్సిపల్ అధికారులు వెంటనే పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జిలా ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మేట్ లేకుండా వాహనాలు నడిపితే మార్చి 1వ తేది నుంచి రూ.1000 జరిమాన విధించటం జరుగుతుందని, దీనిపై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. సమావేశంలో ఆర్‌అండ్‌బి ఎస్.ఈ శ్రీనివాసమూర్తి, జిల్లా ఉప రవాణా కమిషనర్ సీతారామిరెడ్డి, జాతీయ రహదారుల పీడీ పార్వతీశం, పంచాయితీ రాజ్ ఎస్ ఈ బ్రహ్మయ్య వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

డాక్టర్ ఎస్‌వి సుబ్బారావుకు ఘన నివాళి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్.వి.సుబ్బారావు చౌదరి సంస్మరణ సభ గురువారం ఆస్పత్రి ప్రాంగణంలోని శుశృత హాలులో జరిగింది. ఈనెల 6న ఆయన మృతి చెందారు. సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.ఎస్.వి.రమణ సభలో మాట్లాడుతూ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్‌గా, సూపరింటెండెంట్‌గా సుబ్బారావు చౌదరి అనితర మైన సేవలు అందించారని తెలిపారు. ఆయన ఉద్యోగ విరమణ చేసినప్పటికీ ఎంతో మంది సర్జన్స్ కు ఆయన విద్య నేర్పడానికి కళాశాల, ఆసుపత్రి అభివద్ధికి ఆయన ఇచ్చిన సలహాలు, సూచనలు అభివద్ధి పథంలోకి తీసుకువెళ్ళాయన్నారు. గుంటూరు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారి మాట్లాడుతూ ఆయన ఒక సర్జన్ గా స్ఫూర్తిని ఇచ్చిన వారిలో డాక్టర్ చౌదరి ఒకరు అన్నారు. డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఉమా జ్యోతి, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ సుధాకర్, చౌదరి కుమారులు డాక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు.



వెట్‌ల్యాండ్ నిర్వహణపై కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లా స్థాయి వెట్‌ల్యాండ్ మేనేజ్మెంట్ సమావేశం గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మీ , సంయుక్త కలెక్టర్ ఏ.భార్గవ్ తేజతో కలసి పాల్గొన్నారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని పెదకాకాని మండలం ఉప్పలపాడు గ్రామంలో ఉన్న పక్షుల రక్షిత కేంద్రాన్ని వన్యప్రాణి చట్టం -1972 నిబంధనల ననుసరించి కన్జర్వేషన్ రిజర్వ్‌గా నోటిఫికేషన్ ఇవ్వడం, గుంటూరు జిల్లాలోని వెట్‌ల్యాండ్‌లను వెట్‌ల్యాండ్ రూల్స్ 2017 ప్రకారం నోటిఫై చేయాల్సి వుందన్నారు. సమావేశంలో పాల్గొన్న జిల్లా అటవీ శాఖ అధికారి హిమశైలజ మాట్లాడుతూ ఉప్పలపాడు పక్షుల కేంద్రం గత 20 సంవత్సరాలుగా అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతుందన్నారు. దీనికి వన్యప్రాణి చట్టం ప్రకారం -1972 ద్వారా కన్జర్వేషన్ రిజర్వ్‌గా ప్రకటించి ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలన్నారు. అరుదైన పక్షి జాతులను కాపాడుకోవాలని, వెట్ ల్యాండ్ యొక్క ఉపయోగాలను వివరించారు. దీనికి సంబంధించి సంబంధిత శాఖల అధికారులు సహకారాన్ని అందించాలని కోరారు. జిల్లాలో ఇప్పటి వరకు ఫారెస్ట్ డిపార్ట్మెంట్ ద్వారా గుర్తించిన 300 వెట్‌లాండ్స్‌ను పంచాయితీరాజ్, ఇరిగేషన్ , ఆర్ డబ్ల్యూ ఎస్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు , రెవెన్యూ స్టేక్ హోల్డర్ శాఖల అధికారులు వాటిని సంయుక్తంగా పరిశీలించి నివేదిక అందించాలని జిల్లా కలెక్టర్ అధికారులను కోరారు. సమావేశంలో డిఆర్‌ఓ షేక్. ఖాజావలి, ఆర్డిఓ కె.శ్రీనివాసరావు, జేడి పశు సంవర్ధక శాఖ ఓ.నరసింహారావు వివిధ శాఖల అధికారులు పాల్గన్నారు.

శంకర్‌విలాస్ ఆర్ఓబి పనులపై కమిషనర్ సమీక్ష

ప్రజాశక్తి-గుంటూరు : శంకర్ విలాస్ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించి ప్రభావిత భవనాల తొలగింపు, కాంపౌండ్ వాల్ నిర్మాణం, టిడిఆర్ బాండ్లు, నష్టపరిహారాల పంపిణీ అంశాలను జిఎంసి ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులు సమన్వయంతో పూర్తి చేయడానికి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. గురువారం కమీషనర్ తమ చాంబర్‌లో ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులకు శంకర్ విలాస్ ఆర్‌ఓబి పనులపై జిఎంసి చేపట్టాల్సిన పనులపై తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ శంకర్‌విలాస్ ఆర్‌ఓబి పనులు త్వరలో ప్రారంభమయ్యే అవకాశం ఉన్నందున జిఎంసి నుండి చేపట్టాల్సిన రోడ్డు విస్తరణ పనులను, ప్రభావిత భవనాల తొలగింపు పనులు పూర్తి చేయాలన్నారు. భవనాల తొలగింపు అనంతరం ఇరువైపులా కాంపౌండ్ వాల్ నిర్మాణం చేపట్టడానికి అంచనాలు సిద్ధం చేయాలన్నారు. 26 మందికి తాము కోల్పోతున్న భవనాలకు సంబందించి నష్ట పరిహారం అందించడానికి ప్రతిపాదనలు 25వ తేదీకి పూర్తి చేయాలని ఎస్ఈని ఆదేశించారు. అలాగే ఆయా ప్రాంతాల్లో టిడిఆర్ బాండ్లు ఇవ్వాల్సిన వాటికి ప్రక్రియ మొదలు పెట్టాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఎస్ఈ నాగ మల్లేశ్వరరావు, ఈఈలు సుందర్రామిరెడ్డి, కోటేశ్వరరావు, డిసిపి సూరజ్ కుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

అద్దె చెల్లించని షాప్‌లను సీజ్ చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు : నగరపాలక సంస్థ షాపింగ్ కాంప్లెక్స్‌లో దీర్ఘకాలంగా అద్దె చెల్లించని షాపులను సీజ్ చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు రెవెన్యూ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని ఎన్టీఆర్ స్టేడియం కాంప్లెక్స్‌లోని షాప్‌లను పరిశీలించి, వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థకు చెందిన షాపింగ్ కాంప్లెక్స్‌ల్లో అద్దెకు తీసుకొని, సుధీర్ఘకాలం నుండి అద్దెలు చెల్లించని వాటిని తక్షణం సీజ్ చేయాలని, ఎన్టీఆర్ స్టేడియం కాంప్లెక్స్‌లోని 5,6 షాప్‌లను సీజ్ చేయాలని రెవెన్యూ అధికారి మదన్‌గోపాల్‌ని ఆదేశించారు. కాంప్లెక్స్‌లో మొత్తం షాప్‌లు, అద్దె బకాయిలు, ఖాళీగాఉన్న షాప్‌ల వివరాలు, నగరంలోని ఇతర ప్రాంతాల్లో కాంప్లెక్స్‌ల వివరాలను సమగ్ర నివేదిక రూపంలో అందించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఖాళీ షాప్‌లకు వేలం వేయడానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

గాంధీ ఆశయాలకు మతోన్మాదులు తూట్లు

'గాంధీయే మార్గం' పుస్తకావిష్కరణలో వక్తలు

ప్రజాశక్తి-గుంటూరు

నేడు భారతదేశంలో ఎదుర్కొం టున్న సమస్యలకు గాంధీయే మార్గం అని ఆకాశవాణి పూర్వ సంచాలకులు డాక్టర్ నాగసూరి వేణుగోపాల్ అన్నారు. గురువారం స్థానిక జనచైతన్య వేదిక హాలులో అమరావతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్, జనచైతన్య వేదిక సంయుక్త ఆధ్వర్యంలో 'గాంధీయే మార్గం' పుస్తకా విష్కరణ సభకు జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షత వహించారు. డాక్టర్ వేణుగోపాల్ మాట్లాడుతూ ప్రపంచానికి అహింస ఆయుధాన్ని అందించిన మహనీయుడు గాంధీజీ అని కొనియాడారు. మత సామరస్యం, దళిత, గిరిజన ఉద్ధరణ, విదేశీ వస్తువుల బహిష్కరణ, మద్యపాన నిషేధం లాంటి సమస్యలపై ఉద్యమించి ప్రజ ల్ని కదిలించి స్వాతంత్ర్య ఉద్యమ ంలో భాగస్వామ్యం చేశారన్నారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్ర సాద్ మా ట్లాడు తూ గాంధీ యిజాన్ని ఆచ రించకపోతే వీర రాఘవరెడ్డి లాంటి వాళ్లు పెరుగు తారని, కుల, మత, ప్రాంతీయ విద్వేషా లను రెచ్చ గొట్టవద్దని, ప్రజల ఐక్యతే సమాజానికి మేలు చేస్తుందని వందేళ్ల క్రితమే గాంధీజీ ఉద్బోధించారన్నారు. నేడు గాడ్సే వాదులు మత విద్వేషాన్ని రెచ్చగొడుతూ ముస్లింల పట్ల వ్యతిరేకతను పెంచుతూ రాజకీయ లబ్ధికోసం గాంధీజీ పట్ల ద్వేష భావాన్ని ప్రజలలో పెంచుతున్నారన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే మహిళలు, దళితులు, గిరిజనులు, బలహీన వర్గాల పట్ల విద్వేష భావాలు పెరిగే ప్రమాదం ఉందన్నారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వి.లక్ష్మణరెడ్డి మాట్లాడు తూ మతోన్మాద శక్తులు గాంధీజీ, నెహ్రూ పట్ల ద్వేషభావం పెంపొందిస్తున్నారని, సోషల్‌మీడియా, వాట్సాప్ యూని వర్సిటీల ద్వారా విద్వేష ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గాంధీజీ ఆనాడు మద్యపానం మానమని, ప్రభుత్వం మద్యం అమ్మకాలను ఆదాయ వనరులుగా చూడటం పాపమని ఉద్బోదిస్తే నేడు ప్రభుత్వాలు మద్యం అమ్మకా లను ప్రోత్సహిస్తూ, ఆదాయ వనరులుగా మారుస్తూ, ప్రజలు తూలుతూ ఉంటే ప్రభుత్వాలు నిలబడతాయని భావిస్తున్న సమయం ఆసన్నమైందన్నారు. గాంధీయే మార్గం పుస్తకాన్ని ఆచార్య నాగార్జున విద్యాలయ విశ్రాంత రిజిస్ట్రార్ రావెల సాంబశివ రావు పుస్తక పరిచయం చేశారు. కార్యక్రమంలో ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ డి.ఎ.ఆర్. సుబ్రహ్మణ్యం, విశ్రాంత తెలుగు ఆచార్యులు వావిలాల సుబ్బారావు, నేస్తం సహ వ్యవస్థాప కులు టి. ధనుంజయ రెడ్డి, సెర్ప్ ఎన్.జి.వో అధ్యక్షులు హనుమప్రసాద్ వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



పుస్తకావిష్కరణలో వేణుగోపాల్, లక్ష్మణరెడ్డి, రావెల తదితరులు

అక్రమ కేసులతో డబ్బులు గుంజుతున్న మహిళలు

సమగ్ర విచారణకు బాధితుని వేడుకోలు

ప్రజాశక్తి - చేబ్రోలు

గుంటూరుకు చెందిన నంద్యాల రాజేశ్వరి, రేణుక అనే ఇద్దరు మహిళలు కొందర్ని లక్ష్యంగా చేసుకుని వారిపై తప్పుడు కేసులు పెట్టి డబ్బులు గుంజుతున్నారని, తననూ ఓ కేసులో ఇరికించారని మండల కేంద్రమైన చేబ్రోలుకు చెందిన రియలెస్టేట్ వ్యాపారి, బిల్డర్ అయిన గట్టుపల్లి సుబ్రహ్మణ్యం చెబుతున్నారు. వీరికి ఇతర దేశాల్లో ఉంటున్న కుటుంబ సభ్యులు సహకరిస్తున్నారని తెలిపారు. వీరు పంపే ఫోన్‌కాల్ రికార్డింగులు, ఫొటోలను ఎడిట్, మార్ఫింగ్ చేసి ఇవ్వగా వాటి ఆధారంగా మహిళలిద్దరూ వారెంచుకున్నవారిపై తప్పుడు కేసులు పెట్టి బెదిరించి సెటిల్‌మెంట్లు చేసుకోవడమే పనిగా పెట్టుకున్నారని అంటున్నారు. దీనిపై పోలీసులు సమగ్ర విచారణ చేయాలని కోరుతున్నారు. ఈ మహిళల చేతులో మంగళగిరి థియేటర్ ఓనర్ చినబాబు, పెదకాకాని మండలం కంతేరుకు చెందిన టిడిపి నాయకుడు, చేబ్రోలులోని గట్టుపల్లి సుబ్రహ్మణ్యం మోసపోయామని, తాము పోలీసులనూ ఆశ్రయించామని తెలిపారు. మహిళల ఖాతాల్లోకి రూ.లక్షలలు ఎలా, ఎందుకు వస్తున్నాయి? వాటికి పన్ను చెల్లిస్తున్నారా? అనేది తేల్చాలంటున్నారు. చిన్న వ్యాపారికి భార్య అయిన నంద్యాల రాజేశ్వరి తన వద్ద ప్లాట్లు అమ్మే బ్రోకర్‌గా చేరి మోసపూరితంగా ఆమె కుటుంబీకులకు, బంధువులకు ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసుకోవడమే కాకుండా ప్లాట్లకు సంబంధించిన డబ్బులను ఆన్‌లైన్ ద్వారా తనకు చెల్లించి వాటిని అప్పుగా చూపుతూ పోలీస్ కేసులతో వేధిస్తోందని చెప్పారు. ఒక పోలీస్ అధికారి ఆమెకు అండగా ఉన్నారని, గుర్తు తెలియనివారితో పోలీసులంటూ ఫోన్‌లు చేయించి భయపెడుతున్నారని, వీటిని రికార్డు చేసి ఎస్పీ, ఐజి, డిఐజిలకు ఫిర్యాదు చేశామని చెప్పారు. అయితే ఆ ఫిర్యాదులపై చర్యలు లేని కారణంగా రాజేశ్వరి ఆగడాలు మరింత పెరిగిపోతున్నాయని అన్నారు. ఈమెతో పాటు బెదిరింపులకు దిగుతున్న చదలవాడ రేణుక భర్త ఒక మాజీ పోలీస్ కానిస్టేబుల్ అని, కంతేరుకు చెందిన టిడిపి నాయకునికి రూ.ఐదు లక్షలిచ్చి అక్రమ కేసులతో రూ.90 లక్షలు కొట్టేశారనే ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. వీటన్నింటిపై సమగ్ర విచారణ చేసి ఇతరులెవరూ మోసపోకుండా చూడాలని సుబ్రహ్మణ్యం కోరుతున్నారు.

పంటలకు ధరలపై ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి : కొల్లా రాజమోహన్

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పంటలకు ధరల్లేక, అప్పులపాలవుతూ రైతులు తీవ్ర మనస్థాపంతో ఉన్నారని నల్లమడ రైతుసంఘం అధ్యక్షులు డాక్టర్ కొల్లా రాజామోహనరావు అన్నారు. పట్టణంలోని తన నివాసంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. పైర్లకు తెగుళ్ల బెడద ఎక్కువైందని, పురుగుల నివారణకు రైతులు అధికంగా ఖర్చు చేయాల్సి రావడంతో భారీగా పెట్టుబడులు పెరిగాయని చెప్పారు. నియోజకవర్గంలో పత్తి 2500 ఎకరాల్లో, మిర్చి 2400 ఎకరాల్లో, పొగాకు 4700 ఎకరాల్లో, శనగ 3వేల ఎకరాల్లో సాగవగా పత్తికి ఎకరాకు రూ.50 వేలు, మిర్చికి రూ.లక్ష, పొగాకుకు రూ.లక్ష నుంచి లక్షన్నర, శనగకు రూ.25-30 వేల వరకూ పెట్టుబడులయ్యాయని వివరించారు. అయితే పంటలకు ధరల్లేని కారణంగా కనీసం పెట్టుబడులైనా రాకపోగా రూ.50 వేల నుండి రూ.లక్ష వరకు నష్టాలు వస్తున్నాయన్నారు. గతేడాది మిర్చి పంట 15 లక్షల బస్తాలు కోల్డ్ స్టోరేజీల్లో నిల్వలున్నాయని, ధరకూడా రూ.20 వేల నుండి ఈ ఏడాది రూ.8-13 వేలకు పడిపోయిందని చెప్పారు. మార్కెట్ ఇంటర్వేన్షన్ పథకం ద్వారా ప్రభుత్వం సత్వరం జోక్యం చేసుకోవాలని కోరారు. గతేడాది తెల్ల శనగ ధర రూ.10 వేలకుపైగా ఉండగా ఇప్పుడు రూ.6500కు మించడం లేదని, ఎర్ర శనగ రూ.7200 నుండి రూ.5600కు పడిపోయిందని తెలిపారు. శనగ విత్తనాలను రూ.9 వేలకు రైతుసేవా కేంద్రాల ద్వారా ఇచ్చారని, అలాంటప్పుడు పంటను కనీసం క్వింటాళ్ రూ.9 వేలకు కొనాలి కదా? అని ప్రశ్నించారు. ఆదాయం వస్తుందనే ఆశతో ఎక్కువ మంది రైతులు పొగాకు సాగు చేశారని, ఎకరాకు రూ.30-40 వేల కౌలు చెల్లించారని, తీరా ధర చూస్తే రూ.15-18 వేల నుండి రూ.4-5 వేలకు పతనమైందని ఆవేదన వెలిబుచ్చారు. మరోవైపు సిగరెట్, బీడీ ధరలు మాత్రం తగ్గలేదని అన్నారు. పొగాకు బోర్డు జోక్యం చేసుకుని బర్లీ పొగాకు ధర పడిపోకుండా చూడాలని కోరారు. అన్ని రకాల పంటలను దళారులతో ప్రమేయం లేకుండా ప్రభుత్వమే మద్దతు ధరలకు కొనాలని డిమాండ్ చేశారు.



ప్రసవాల్లో ఆపరేషన్లను వీలైనంత తగ్గించాలి : డిఎంహెచ్ఒ

ఆస్పత్రుల్లో నిబంధనల అమలుపై తనిఖీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

అన్ని ప్రైవేటు, ప్రభుత్వ ఆసుపత్రులు వైద్యారోగ్యశాఖ నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని పల్నాడు జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ బి.రవి ఆదేశించారు. జిల్లాలో అన్ని ప్రైవేటు ప్రభుత్వ ఆసుపత్రుల్లో జరిగిన సి-సెక్షన్ ఆపరేషన్ల ఆడిట్‌లో భాగంగా స్థానిక శ్రేయ ఐవిఎఫ్ సెంటర్‌ను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సి-సెక్షన్ జరుగుటకు గల కారణాలను పరిశీలించి వీలైనంత వరకు సి సెక్షన్ డెలివరీస్ తగ్గించాలని సూచించినారు. స్కాన్ సెంటర్‌ను పరిశీలించి పీసీపీ యాక్ట్ నిబంధనలకు లోబడి అన్ని మార్పులు సరిచేసుకోవాలని చెప్పారు. ఆస్పత్రులన్నీ రిజిస్ట్రేషన్, రెన్యువల్స్ సకాలంలో చేసుకోవాలన్నారు. లోపాలుంటే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో నీలకంఠేశ్వరరావు, స్టాటిస్టికల్ ఆఫీసర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్షలకు మించి చాలా జీవితం...



- భయపడి ఒత్తిడికి గురికావొద్దు
- సమస్యలుంటే ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు చెప్పండి
- పరీక్షను కొలమానంగా కాకుండా అవకాశంగా భావించండి
- పదో తరగతి విద్యార్థులతో పల్నాడు కలెక్టర్, ఎస్పీ
- ఆన్‌లైన్ ద్వారా జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల విద్యార్థులకు స్ఫూర్తి పేరుతో ప్రత్యేక కౌన్సెలింగ్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పదో తరగతి విద్యార్థులు అనవసర భయాలు, ఒత్తిడికి లోనుకాకుండా పరీక్షలు రాయాలని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు పిలుపునిచ్చారు. పరీక్షలంటే భయం పోగొట్టేందుకు 'స్ఫూర్తి' పేరుతో ప్రత్యేక కౌన్సెలింగ్ కార్యక్రమాన్ని పదో తరగతి విద్యార్థుల కోసం నరసరావుపేటలోని కలెక్టరేట్ నుండి గురువారం ఆన్‌లైన్ ద్వారా నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఫలితాల గురించి అతిగా ఆలోచించకుండా చేయాల్సిన పని గురించి మాత్రమే దృష్టి సారిస్తే ఒత్తిడి దరిచేరదన్నారు. ఒత్తిడికి గురైనప్పుడు తమ భయాలను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, స్నేహితులతో పంచుకోవాలని చెప్పారు. పదో తరగతి అనేది విద్యార్థి జీవితంలో కేవలం ప్రారంభం మాత్రమేనని, పరీక్షలకు మించిన జీవితం ఎంతో ఉందని అన్నారు. ఎస్పి కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ పరీక్షలు అనేవి ఎవరో మన జ్ఞానాన్ని కొలిచే కొలమానాలుగా కాకుండా మన జ్ఞానాన్ని ప్రదర్శించే అవకాశాలుగా భావించాలన్నారు. ఎప్పటికప్పుడు చేసిన పొరపాట్లను గుర్తించి వాటిని సరిచేసుకున్న వారు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకుంటారని చెప్పారు. నిపుణులు మాట్లాడుతూ అందుబాటులో ఉన్న సమయానికి తగ్గట్టు టైం టేబుల్ తయారు చేసుకుని క్రమపద్ధతిలో చదవాలన్నారు. పరీక్షల సమయంలో బాగా చదవడంతో పాటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ముఖ్యమన్నారు. పరీక్షల ముందు రోజు అర్ధరాత్రి వరకూ చదివి ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటే పరీక్షలు రాయలేని పరిస్థితి వస్తుందని హితవు పలికారు. కార్యక్రమంలో డిఇఒ చంద్రకళ, రిటైర్డు ఐఎఎస్ బి.రాజేశ్వరరావు, వ్యాపార వేత్త వీరరాఘవరావు, ట్రైనర్లు బొండ్లపాటి రాధిక, చిన్నం వెంకట్ పాల్గొన్నారు. జిల్లాలోని 456 పాఠశాలల మేనేజ్ మెంట్లు, పదో తరగతి విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ ఆన్‌లైన్ ద్వారా వీక్షించారు.

ప్రజాశక్తి-ఈపూరు

లక్ష్యాల సాధనకు కష్టపడి చదవాలని విద్యార్థులకు సర్వశిక్ష అభియాన్ అడిషనల్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ వరద సుబ్బారావు సూచించారు. మండల కేంద్రమైన ఈపూరు కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఇంటర్, పదో తరగతి విద్యార్థినులతో మాట్లాడి వారి భవిష్యత్తు లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. తల్లిదండ్రుల కష్టాలను గుర్తించి విద్యను అభ్యసిస్తే మంచి స్థానాలు పొందవచ్చన్నారు. అనంతరం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో 24 కేజీబీవీ పాఠశాలలో పదో తరగతిలో 880 మంది, ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలు కలిపి 1340 మంది పరీక్షలకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలు చేపడుతున్నామన్నారు. ఆరో తరగతి నుండి విద్యాసామర్థ్యాలు పెంచేందుకు ప్రభుత్వం పాల్‌ల్యాబ్ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి ఒక్కొక్క పాఠశాలకు 30 చొప్పున 24 కేజీబీవీలకు 720 ట్యాబ్‌లను అందించినట్లు చెప్పారు. పాల్ ల్యాబ్‌లో బోధన చేస్తున్న విద్యార్థినిలతో మాట్లాడారు. పాల్ ల్యాబ్ వినియోగంలో పలనాడు జిల్లా రాష్ట్రంలో రెండవ స్థానంలో ఉందన్నారు. పదవ తరగతి విద్యార్థుల కోసం జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు 'స్ఫూర్తి' కార్యక్రమాన్ని తెచ్చారని, మెరుగైన ఫలితాల సాధనకు ఇది దోహదం చేస్తుందని అన్నారు. పంచతంత్ర ద్వారా సబ్జెక్టుల వారీగా ప్రత్యేక బోధన చేస్తున్నామన్నారు. అనంతరం కేజీబీవీలో నూతన భవన నిర్మాణాన్ని, వనికుంటలో మోడల్ స్కూల్ భవన నిర్మాణాన్ని పరిశీలించారు. పనులు నిలిచిపోవడానికి గల కారణాలు తెలుసుకుని పనుల ప్రారంభించాలని పంచాయతీ రాజ్ ఏఈఈ హరనాథ్‌బాబుకు సూచించారు. కార్యక్రమంలో పాల్ ల్యాబ్ జిల్లా నోడల్ అధికారి ఎస్‌డి సాబీర్, ఎంఇఒ రామతులసి, ప్రిన్సిపాల్ జ్యోతి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సునీల్ పాల్గొన్నారు.



విద్యార్థినిలకు సూచనలు చేస్తున్న ఎపిసి వి.సుబ్బారావు,

సమస్యలపై పోరాడే లక్ష్మణరావును గెలిపించండి..




ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పట్టభద్రులైన యువకులు, ఉద్యోగులు, నిరుద్యోగులు, కార్మికులు, వాలంటీర్లు చైతన్యంగా వ్యవహరించాలని, ఈనెల 27న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనేక సంఘాలు బలపర్చిన ఉద్యమ అభ్యర్థి కెఎస్.లక్ష్మణరావుకు ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఎపి గ్రామ వార్డు వాలంటీర్ల సంఘం రాష్ట్ర గౌరవ సలహాదారు ఈదర గోపీచంద్ విజ్ఞప్తి చేశారు. కొన్ని రోజులుగా నరసరావుపేట పట్టణంలోని రామిరెడ్డిపేట, నవోదయ నగర్‌లలో సిఐటియు, యుటిఎఫ్ నేతలు వలీఖాన్, షేక్ సిలార్ మసూద్ ఆధ్వర్యంలో సాగుతున్న ఇంటింటి ప్రచారంలో గోపిచంద్ గురువారం పాల్గొని పట్టభద్రులను ఓట్లు అభ్యర్థించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు గడుస్తున్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో సామాజిక పించన్లు మినహా ఇతర అన్ని హామీలనూ విస్మరించిందన్నారు. వాలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తామని, రూ.10 వేలు వేతనం ఇస్తామని నమ్మించి నట్టేట ముంచారన్నారు. రైతులకు పెట్టుబడి సాయం ఇవ్వలేదని, మద్దతు ధరలను విస్మరించారని, విద్యార్థులకు 'తల్లికి వందనం' అని చెప్పినా ఆ పథకాన్నీ అమలు చేయలేదని, నిరుద్యోగులకు భృతి, మహిళలకు ఆర్థిక ప్రోత్సాహం, ఉచిత బస్సు, అంగన్వాడీ వర్కర్లు, కాంట్రాక్టు ఉద్యోగులు, ఆరోగ్యశ్రీ సిబ్బంది, తదితర వర్గాలకు ఇచ్చిన అనేక అమలు చేయకుండా మోసం చేశారని అన్నారు. వాలంటీర్ల సంఘ రాష్ట్ర అధ్యక్షులు బాషా నేతత్వంలో వాలంటీర్ల బృందం ఇప్పటికే లక్ష్మణరావు కలిసి తమ మద్దతు తెలిపారని గుర్తు చేశారు. సిఐటియు నాయకులు సిలార్ మసూద్ మాట్లాడుతూ శాసన మండలిలో నిర్మాణాత్మక ప్రతిపక్షమైన పిడిఎఫ్ ఎమ్మెల్సీలు నీతి, నిజాయితీకి కట్టుబడి, ప్రజాస్వామ్య విలువలకు లోబడి పని చేస్తారని అన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం మండలిలో మాట్లాడడంతో పాటు అవసరమైతే పోరాటబాట పడతారని చెప్పారు. నిస్వార్ధ రాజకీయాలకు పిడిఎఫ్ కేరాఫ్ అన్నారు. ఆయా వర్గాల ప్రజల పక్షాన వారి సమస్యల పరిష్కారానికి మండలిలో వారి గొంతుక వినిపించ గల సత్తా పిడిఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావుకు ఉందని, ఆయనకు మద్దతుగా నిలుద్దామని కోరారు.

ప్రజాశక్తి - వినుకొండ

ఉమ్మడి కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.ఎస్. లక్ష్మణరావు విజయాన్ని కాంక్షిస్తూ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సిఐటియు నాయకులు కరపత్రాల పంపిణీ చేస్తూ ప్రచారం చేశారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, నిరుద్యోగులు, పెన్షనర్లు, అవుట్సోర్సింగ్ కార్మికులు తదితర అన్ని వర్గాల ప్రజల సమస్యలు పరిష్కారం కోసం పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. శాసనమండలిలో ప్రజల గొంతుకై సమస్యల పరిష్కారం చేసేందుకు, పాలక పక్షాలపై ఒత్తిడి తీసుకువచ్చి, ప్రజా గొంతుకై లక్ష్మణరావు పోరాటాలు చేశారని అన్నారు. ప్రచారంలో సిఐటియు పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.హనుమంతరెడ్డి, నాయకులు నాసర్‌బి పాల్గొన్నారు.



పోరాడే గొంతుకను గెలిపించుకుందాం...


ప్రథమ ప్రాధాన్యతా ఓటుతో గెలిపించాలని ప్రజాసంఘాల విస్తృత ప్రచారం


ప్రచారంలో మాట్లాడుతున్న పాశం రామారావు



ప్రజాశక్తి - తాడేపల్లి
ఉపాధ్యాయులు, ఉద్యోగులు, కార్మికులు, కర్షకులు, ఆశ, అంగన్వాడి, స్కీం వర్కర్ల సమస్యలపై పోరాడే శక్తులను గెలిపించాలని, అందులో మొదటి ప్రాధాన్యత ఓటు కేఎస్ లక్ష్మణ్ రావు కు ఓటు వేసి గెలిపించాలని ప్రజా సంఘాల నాయకులు పాశం రామారావు, బి వెంకటేశ్వర్లు వేముల దుర్గారావు కోరారు. పట్టభద్రులు ఎమ్మెల్సీ ప్రచార క్యాంపెన్లో భాగంగా గురువారం తాడేపల్లి పట్టణంలోని ఉండవల్లి సెంటర్ లోని ర్యాంపు, ఎన్టీఆర్ కట్ట, కృష్ణ నగర్, తాడేపల్లి లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉద్యోగులు, సిబ్బందిని కలిసి ఓట్ల అభ్యర్థించారు. కుటుంబ సభ్యులకు కూడా చెప్పి కె ఎస్ గెలుపుకు తోడ్పడాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఆయా ప్రాంతాల్లో సానుకూలమైన స్పందన వ్యక్తమైనట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు దొంతి రెడ్డి శ్రీనివాస్ కుమారి, ఏ శవిరి భర్తలో, యేసయ్య, రాయన్న, కే బాబురావు, కే మేరీ, డి దేవకుమార్ పాల్గొన్నారు.

రాజధానిలో ప్రచారం : రాజధానిలో భాగమైన ఉండవల్లిలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె ఎస్ లక్ష్మణరావు విజయాన్ని కాంక్షిస్తూ గురువారం ప్రజాసంఘాల నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. పిడిఎఫ్ అభ్యర్థి గెలుపు ప్రజల గెలుపుగా భావించాలని కోరారు. ఆ ప్రాంతంలో సనుకుల స్పందన వ్యక్తం అయినట్లు నాయకులు చెప్పారు. ఈ కార్యక్రమంలో టి బక్కిరెడ్డి, కే రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



అన్నివర్గాల సమస్యలపై మండలిలో ..

ప్రజాశక్తి - మంగళగిరి
కృష్ణ, గుంటూరు జిల్లాల ఉమ్మడి పట్టభద్రుల నియోజకవర్గం నుండి పోటీ చేస్తున్న పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కెఎస్ లక్ష్మణరావు విజయాన్ని కాంక్షిస్తూ మంగళగిరిలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. అన్ని వర్గాల ప్రజల సమస్యలను శాసనమండలిలో ప్రస్తావించే కే.ఎస్ లక్ష్మణరావు కు ఓటేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు జెవి రాఘవులు, వివి జవహర్లాల్, ఎస్ ఎస్ చంగయ్య పి బాలకృష్ణ, ఎం బాలాజీ పాల్గొన్నారు.



అంగన్వాడీల దీక్షలకు మద్దతుగా..

ప్రజాశక్తి - తుళ్లూరు
పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె ఎస్ లక్ష్మణరావు విజయాన్ని కాంక్షిస్తూ మండలంలోని వడ్డమానులో సిఐటియు రాజధాని డివిజన్ కమిటీ ఆధ్వర్య ంలో కరపత్రాలు పంపిణీ చేసి విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం భాగ్యరాజు మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కార్మికులు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, నిరుద్యోగులు, అంగన్వాడిల,ఆశా వర్కర్లు, వైద్య ఆరోగ్య ఉద్యోగులు, కౌలు రైతులు, గురుకులాల సిబ్బంది సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్సీగా కెఎస్ లక్ష్మణరావు గళం వినిపించారని, నిబద్ధతతో పనిచేశారని గుర్తు చేశారు.లక్ష్మణరావు గెలుపు ఆవశ్యకత గురించి వివరించారు. కార్యక్రమంలో కె కోటేశ్వరరావు, డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలియజేస్తున్న నిరుద్యోగులు

రోస్టర్ అమలు తర్వాతే గ్రూప్-2 మెయిన్స్ నిర్వహించాలి

ప్రజాశక్తి-గుంటూరు
రోస్టర్ విధానం అమలు చేసిన తర్వాతే గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష నిర్వహించాలని నిరుద్యోగులు కోరారు. ఈ మేరకు అరండల్పేటలోని జిల్లా కేంద్ర గ్రంథాలయం వద్ద అభ్యర్థులు ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నిరుద్యోగ ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ కొల్లికొండ వెంకట సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రాష్ట్రంలో 2023 డిసెంబర్ 7న విడుదల చేసిన గ్రూప్-2 నోటిఫికేషన్లో రోస్టర్ విధానాన్ని పాటించకుండా మెయిన్స్కి అభ్యర్థులను ఎంపికచేయటం అన్యాయమని, అభ్యర్థులు ఈవిధానం వల్ల తీవ్రనష్టపోతున్నారని అన్నారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా రోస్టర్ విధానాన్ని నిర్వహించిన తరవాతే మెయిన్స్ నిర్వహించాలని అప్పటివరకు ఈనెల 23న జరగనున్న గ్రూప్ 2 మెయిన్స్ పరీక్షను నిలిపివేయాలని కోరారు. అదే విధంగా రోస్టర్ విధానం సరిగ్గా పాటించకపోతే పోస్టులు మిగిలిపోయే అవకాశం ఉందని, ఫలితంగా అర్హత కలిగిన అభ్యర్థులకు అన్యాయం జరుగుతుందని చెప్పారు. కావున రాష్ట్ర ప్రభుత్వం ఈసమస్యపై తక్షణమే స్పందించి రాష్ట్ర వ్యాప్తంగా 92000 పైగా ఉన్న అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అభ్యర్థులు వెంకట్, రాజీవ్, నాగరాజు శ్రీనివాస్, శివ పాల్గొన్నారు.

రైతుల కోసం కెఎస్ పోరాటం






ప్రజాశక్తి - కొల్లిపర
రైతులు కార్మికులు కష్టజీవులు ఉద్యోగ ఉపాధ్యాయ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై నిత్యం పోరాడుతూ ప్రభుత్వాన్ని ప్రశ్నించే ఎమ్మెల్సీ కె ఎస్ లక్ష్మణ రావును తిరిగి శాసనమండలికి పంపించే బాధ్యత రైతులు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మొలక శివ సాంబిరెడ్డి కోరారు. గురువారం మండల కేంద్రమైన కొల్లిపర మున్నంగి తూములూరు గ్రామాలలో ప్రజాసంఘాల కార్యకర్తలు కెఎస్ లక్ష్మణరావు గెలుపు కోసం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. దుగ్గిరాల శుభమహేశ్వరి కోల్డ్ స్టోరేజీలో రైతులు గత 13 సంవత్సరాలుగా నిలువ చేసుకున్న రూ. 100 కోట్ల విలువైన పసుపు దగ్గమైతే ఎమ్మెల్సీ లక్ష్మణరావు జోక్యం చేసుకొని ప్రభుత్వం దృష్టికి అధికారుల దృష్టికి వెళ్లిన ఘటన ఆయన గుర్తు చేశారు. 42 రోజులపాటు అంగన్వాడీలు చేసిన ఆందోళనలో వారి గొంతుకయ్యారని తెలిపారు. నిజాయితీపరుడైన ప్రశ్నించే లక్ష్మణ రావు తిరిగి శాసన మండలికి పంపించాలని సిఐటియు మండల కార్యదర్శి కోట చంద్రశేఖర రావు విజ్ఞప్తి చేశారు.

ప్రజాశక్తి- దుగ్గిరాల : దుగ్గిరాల మండలం మోరంపూడి గ్రామంలో కేస్ లక్ష్మణరావు విజయాన్ని కాంక్షిస్తూ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఆశా వర్కర్లు యానిమేటర్లు నిరుద్యోగుల సమస్యల్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారని చెప్పారు లక్షలాదిమంది నిరుద్యోగులకు గ్రూప్ వన్ గ్రూప్ టు డీఎస్సీ సంబంధించి ఉచితంగా కోచింగ్ నిర్వహించి వాళ్ళకి మెరుగైన ఉద్యోగాలు జీవితాలను కల్పించ టం లో లక్ష్మణరావు పాత్ర గణనీయంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జెట్టి బాలరాజు రైతు సంఘం మండల కార్యదర్శి వై బ్రహ్మేశ్వర రావు జి నాగేశ్వరావు సురేష్ పాల్గొన్నారు.



నిరుద్యోగులకు అండగా పోరాటం..

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్
ఎల్లవేళలా ప్రజలకి అండగా ఉండే కే ఎస్ లక్ష్మణరావు కి ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని రైతు సంఘం నాయకులు అత్తులూరి వీరవెంకయ్య పట్టభద్రులకి విజ్ఞప్తి చేశారు. గురువారం యర్రబాలెంలోని సచివాలయాలు, సీఆర్ డి ఏ కార్యాలయం, పి హెచ్ సి, బ్యాంకు, ఇతర ప్రభుత్వ కార్యాలయాలలో, శ్రీనగర్ కాలనీ, శ్రీరామ నగర్లలో ప్రచారం నిర్వహించారు. గత 18సంవత్సరాలలో శాసనమండలి సభ్యులుగా ఉద్యోగ, ఉపాధ్యాయ, నిరుద్యోగులు, కార్మికులు ఎదుర్కొన్న అనేక సమస్యల పరిష్కారం కై లక్ష్మణరావు చేసిన కృషి ని అందరు గుర్తు పెట్టుకొని ఆయన్ని గెలిపించాలని కోరారు. కార్యక్రమం లో ప్రజాసంఘాల నాయకులు ఎల్ రాధికా, అంతోని, అరుణ్, జి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డిఇఒ

అంగన్వాడీల శిక్షణను పరిశీలించిన డిఇఒ

ప్రజాశక్తి-గుంటూరు
స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంగన్వాడీ కార్యకర్తల ఆరు రోజుల ప్రత్యేక శిక్షణా కార్యక్రమంలో భాగంగా చౌత్రా సెంటర్లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో జరుగుతున్న శిక్షణా కార్యక్రమాన్ని గురువారం జిల్లా విద్యాశాఖ అధికారి సి.వి.రేణుక సందర్శించారు. ఈసందర్భంగా డిఇఒ మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల్లో నిర్వహిస్తున్న ప్లే స్కూలుకు దీటుగా అంగన్వాడి కేంద్రాలు నిర్వహించాలని, తద్వారా భవిష్యత్తులో ప్రభుత్వ పాఠశాలల్లో నమోదయ్యే విద్యార్థుల పునాది బలంగా ఉంటుందని అన్నారు. కాబట్టి ఈ శిక్షణ ద్వారా నేర్చుకున్న నూతన విద్యా విధానాలను ఆయా కేంద్రాల్లో విద్యార్థులకు బోధించాలని, ప్రభుత్వం ప్రాథమిక విద్యను ప్రోత్సహించడానికి ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తుందని అన్నారు. కోర్స్ డైరెక్టర్ అబ్దుల్ ఖుదూస్ మాట్లాడుతూ ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని, వీటి ద్వారా తమ బోధనా నైపుణ్యాలు పెంచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.డి. ఖాసీం, రిసోర్స్ పర్సన్స్ బి. జ్యోతి, శైలజ, అనురాధ మరియు రమాదేవి తదితరులు పాల్గొన్నారు.




రాధా రంగా నగర్లో విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్
కృష్ణ గుంటూరు ఉమ్మడి జిల్లాల పిడిఎఫ్ ఎమ్మెల్సీ కె ఎస్ లక్ష్మణరావు విజయాన్ని కాంక్షిస్తూ, గురువారం రాత్రి ఎం.టి.ఎం.సి పరిధిలోని, వడ్డేశ్వరం రాధా రంగా నగర్ ఏరియాలో ప్రజాసంఘాల నాయకులు కరపత్రాలు పంపిణీ చేస్తూ, విస్తత ప్రచారాన్ని చేపట్టారు. అన్ని వర్గాల ప్రజల సమస్యల పరిష్కారం కోసం శాసనమండలిలో పోరాటం చేసిన లక్ష్మణరావుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని నాయకులు ఓటర్లను అభ్యర్థించారు. పలువురు పట్టభద్రులు లక్ష్మణరావు విజయాన్ని కాంక్షిస్తున్నామని, ఆయనకే తమ ఓటు అని, మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించుకుంటామని ప్రజా నాయకులతో చెప్పారు. ప్రచార కార్యక్రమంలో సిఐటియు తాడేపల్లి మండల నాయకులు దొంతి రెడ్డి వెంకటరెడ్డి, కౌలు రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, నల్లపు కిషోర్ బాబు పాల్గొన్నారు.

ఇంటింటికీ ప్రచారం

ప్రజాశక్తి - పెదనందిపాడు
ప్రజా సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థి కె ఎస్ లక్ష్మణరావు ను గెలిపించాలని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నాగులపాడు, పుసులూరు లలో పట్టభద్రులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. మన ప్రాంత సమస్యలను గుంటూరు ఛానల్ పొడిగింపు, నల్లమడ వాగు అభివృద్ధి, ఇతర సమస్యలపై చేస్తున్న ప్రజా పోరాటాలకు లక్ష్మణరావు మద్దతు ఇచ్చారని గుర్తు చేశారు. ప్రజల మనిషి లక్ష్మణరావు గెలుపుకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు దొప్పలపూడి రమేష్, కొత్త వెంకటశివరావు, గుగ్గిలం సాయిబాబు, కాపు వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.



విజ్ఞతతో ఆలోచించండి.. ప్రజానేత లక్ష్మణరావును గెలిపించండి

ప్రజాశక్తి-తెనాలిరూరల్ : ప్రజాసమస్యలపై నిరంతరం పోరాటం చేసే పిడిఎఫ్ అభ్యర్థి కె ఎస్ లక్ష్మణరావు ను గెలిపించాలని ప్రజాసంఘాల నాయకులు భావన్నారాయణ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా స్థానిక ఐతానగర్లో గురువారం ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులైన ప్రజా, ఉద్యోగ, కార్మిక సంఘాల సమస్యలపై శాసనమండలిలో తన గళాన్ని వినిపిస్తూ ప్రజామన్ననలు పొందిన తీరును పట్టభద్రులకు వివరించారు. ఆలోచిత నిర్ణయాలకు తావులేకుండా తమ ఓటును వినియోగించు కోవాలని అభ్యర్థించారు. కార్మిక కర్షక, శ్రామిక, సన్న, చిన్నకారు రైతులు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగ సంఘాలు, నిరుద్యోగ, పారిశ్రామిక సంఘాలు, పారిశుధ్య కార్మికులు, అంగన్వాడీ కార్యకర్తలు, విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయ సంఘాల సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేసిన కె.ఎస్.ఎల్ ను గెలిపించుకోవాలని బాబుప్రసాద్ తెలిపారు. పట్టణంలో 21, 22 వార్డుల్లో షేక్ హుస్సేన్ వలి, రాజ్యలక్ష్మి, ఎస్ఎఫ్ఐ నాయ కులు కిరణ్ ప్రచారం నిర్వహించారు.



ప్రజాశక్తి - గుంటూరు : పిడిఎఫ్ అభ్యర్థి ఎమ్మెల్సీకెఎస్ లక్ష్మణరావును గెలించాలని కోరుతూ గుంటూరు కొరిటపాడులో ప్రజాసంఘాల నాయకులు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో చేతి వృత్తిదారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ ఎం భాస్కరయ్య, ప్రజా సంఘాల నాయకులు రాజు, ఎస్ఎఫ్ఐ నాయకులు ఎస్ అబ్దుల్లా, రజక వృత్తిదారుల సంఘం నాయకులు మండూరు వెంకట నరసయ్య, కొండయ్య, సీతయ్య, , వెంకటేశ్వరరావు, పెద్దిరాజు, దత్తు, బి కైలాసం, బి సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.




రోగాలతో కుక్కల సంచారం.. జనంలో భయం..

వైద్య సౌకర్యాలు లేక నాటు మందులతో సరిపెడుతున్న వైనం... పెంపుడు కుక్కలు సైతం వీధుల్లోకి - చోద్యం చూస్తున్న అధికారులు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

విశ్వాసానికి మారుపేరు శునకం. ప్రధానంగా మనుష్యుల పట్ల విశ్వాసంగా ప్రవర్తిస్తూ వారిని కనిపెట్టుకుని ఉండే శునకాలు నేడు మనిషి ప్రాణానికి ముప్పుగా మారాయంటే అతిశయోక్తి కాదు. ఇటీవల కొన్ని ప్రాంతాల్లో శునకాలు చిన్నారులను గాయపరచిన సంఘటనలు చూస్తున్నాం. శునకాల దాడిలో గాయపడిన చిన్నారులు చికిత్స పొందుతూ మరణించిన సంఘటనలూ విన్నాం. శునకాలు అనారోగ్యం బారిన పడి ప్రజలకు ఆటంకంగా మారాయని కొందరు అభిప్రాయ పడుతున్నారు. శారీరక రుగ్మతలకు లోనైన శునకాలు ఆరోగ్యవంతమైన వాటితో కలసి తిరగటం వల్ల వాటికీ రోగాలు అంటుకుంటున్నాయని పశువైద్యులు అంటున్నారు.

వీధుల్లోకి పెంపుడు కుక్కలు: అధికారులు గతంలో పెంపుడు శునకాలకు లైసెన్స్ ఇచ్చేవారు. వీధుల్లో శునకాల వల్ల ప్రజలు ఇబ్బందులు పడితే మున్సిపాల్టీ వారు వచ్చి వాటిని తీసుకెళ్లేవారు. ఆ సమయంలో లైసెన్సు బిళ్ల మెడలో ఉన్న శునకాలను వదిలిపెట్టేవారు. అయితే ఇపుడు శునక యజమానులు వాటిని సరిగా పోషించలేక కొద్ది రోజులకు వీధుల్లోకి విడిచిపెట్టడంతో అవి కూడా వీధి శునకాలతో కలిసి మనుషులను కరిచే విధంగా తయారవుతున్నాయి. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. పట్టణంలో ప్రధానంగా ఏరియా ప్రభుత్వ ఆస్పత్రి ఒకటి, మండలస్థాయిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు(పి.హెచ్.సి) ఆరు, పట్టణంలో మున్సిపల్ వైద్య శాలలు మూడు ఉన్నాయి. అయితే ఎక్కడా శునకాల సంబంధించి మందుల టీకాలు సిరప్‌లు, ప్రజా వైద్యశాలల్లో లేవనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా శునకాలు కరిచినపుడు వారికి వ్యాక్సిన్ వేయాలి. ప్రభుత్వాసుపత్రుల్లో అందు బాటులో లేనపుడు బయట కొనుక్కుని వేసుకోవాలి. లేదంటే వర్షాకాలం కొత్తనీరు తాగినపుడు ప్రాణాంతక మవుతుంది. ఇప్పటికైనా ప్రభుత్వాధికారులు స్పందించి ప్రజల ప్రాణాలను దృష్టిలో పెట్టుకుని వ్యాక్సిన్ అందుబాటులో ఉంచాలని పలువురు కోరుతున్నారు.


వీపుపై గాయంతో...


ఒళ్లంతా గాయాలతో...

రైతుల ఆర్థిక స్థితి మెరుగుపరచడమే లక్ష్యం

పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ వెంకటేశ్వర్లు నాయక్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రైతుల ఆర్థిక స్థితిని మెరుగుపరచడమే లక్ష్యంగా పశు సంవర్ధక శాఖ పనిచేస్తుందని పశు సంవర్ధక శాఖ ఏరియా సహాయ సంచాలకులు డాక్టర్ వెంకటేశ్వర్లు నాయక్ అన్నారు. గురువారం మండల కేంద్రం రొంపిచర్లతో పాటు మండలంలోని సంతగుడిపాడు, కర్లకుంట, గ్రామాలలో ఆయన పర్యటించారు. ఆయా గ్రామాలలో నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్‌లో రూ.50లక్షల రాయితీతో చేపట్టిన గొర్రెల పెంపకం యూనిట్లు, కర్లకుంట గ్రామంలో పశు వైద్యశాల ఆధునీకరణ పనులను పరిశీలించారు. సంతగుడిపాడు గ్రామంలో సాధుబూసిరెడ్డికి చెందిన ఎన్ఎల్ఎం గొర్రెల పెంపకం యూనిట్, రొంపిచర్లలో నంబుల కోటేశ్వరరావుకు చెందిన ఎన్ఎల్ఎం గొర్రెల పెంపకం యూనిట్‌ను సందర్శించి వాటి నిర్వహణ, మౌలిక సదుపాయాలను పరిశీలించి లబ్ధిదారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్రీయ పద్ధతులలో గొర్రెల పెంపకం, మెరుగైన వైద్య సేవలు పశు సంవర్ధక రంగ అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. పశుసంవర్ధక శాఖ రైతులకు అండగా నిలుస్తుందని అన్నారు. కార్యక్రమంలో నకరికల్లు మండల పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకులు డాక్టర్ రామారావు, పశు వైద్యాధికారులు డాక్టర్ సాయి మహేష్ రెడ్డి, డాక్టర్‌వంశీ, పశువైద్యసిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


గొర్రెల పెంపకం యూనిట్‌ను పరిశీలిస్తున్న డాక్టర్ వెంకటేశ్వర్లు నాయక్

బాల్య వివాహాలపై వీధి నాటిక

ప్రజాశక్తి - కొల్లిపర

బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమని మండల విద్యాశాఖ అధికారి జి.సాల్మన్ రాజు అన్నారు గురువారం కొల్లిపర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చైల్డ్ రైట్స్ అడ్వైజరీ సంస్థ ఆధ్వర్యంలో బాల్యవివాహాల వ్యతిరేక ప్రచార ఉద్యమము, వీధినాటిక ప్రదర్శన నిర్వహించారు ఈ సందర్భంగా సాల్మన్ రాజు మాట్లాడుతూ బాల్య వివాహాలు వ్యతిరేకతపై తల్లిదం డ్రులు పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలన్నారు చట్టప్రకారం వయసు వచ్చిన తర్వాతనే వివాహాలు చేయాలన్నారు కార్యక్రమంలో పి.మత్యుంజయరావు పి.రమేష్ ఉపాధ్యా యులు పి శ్రీలత కీర్తి అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.


బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

పాఠశాల విద్యార్థులకు చిత్రకళా ప్రదర్శన


కళాకారులను సత్కరిస్తున్న అతిథులు

ప్రజాశక్తి - వినుకొండ

ఎంఇఒ సయ్యద్ జప్రుల్లా ద్వారా గురువారం ప్రారంభమైన చిత్రకళా ప్రదర్శనను నియోజకవర్గంలోని అనేక విద్యా సంస్థల విద్యార్థులు తిలకించారు. అనంతరం ఆర్ట్ క్యాంపు ప్రారంభమైంది. 25 మంది చిత్రకారులు స్పాట్ లో బొమ్మలు గీసి అబ్బురపరిచారు. డాక్టర్ వజ్రగిరి జస్టిస్ వందలాది విద్యార్థులు ఎదుట ఆర్ట్ డెమో చేశారు. పౌస్ గౌరవాధ్యక్షులు పి.జె.లూకా, న్యాయవాది మూర్తి, చిత్రకారులు నారాయణ చిత్రకళా విశేషాలు వివరించారు. అపకా అధ్యక్షులు లాం వర్ధనరావు గోడపై అద్భుతమైన చిత్రకళా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. పాస్ కార్యదర్శి పఠాన్ ఖాసిం గోడపై ముచ్చటైన అక్షరాలు లిఖించారు. డా.వజ్రగిరి జెస్టిస్ అధ్యక్షతన సాయంత్రం సభ ప్రారంభమైంది. ఆయన మాట్లాడుతూ అనారోగ్యం పాలైన చిత్రకారుడు మాలకొండయ్య గురించి చెబుతూ కన్నీళ్ళ పర్యంతమయ్యారు. తను చిత్రించిన "ఉషోదయం" చిత్రం కొనుగోలు చేయటం ద్వారా వచ్చిన డబ్బును మాల కొండయ్యకి పంపిస్తానని ప్రకటించగా వెంటనే స్పందించిన జి.వి ఆంజనేయులు వారి సతీ మణి, శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ అధినేత లీలావతి చిత్రాన్ని కొనుగోలు చేసి డబ్బులు అందించి తమ దాతృత్వం చాటుకున్నారు. అనంతరం చిత్రకళా పోటీలలో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు,. ముఖ్య అతిథిగా హాజరైన వినుకొండ కౌన్సిలర్ షకీలా, మద్దు వెంకట స్వామి,కూచి రామాంజనేయులు, పి.జె.లూకా, కేశవసూరి సమక్షంలో కార్యక్రమంలో పాల్గొన్న చిత్రకారులను, పోలో కలర్ వారిని, వాసవి హైస్కూల్ అధినేత నాగోతు అనిల్ కుమార్ దంపతులను సత్కరించారు. కార్యక్రమానికి సహకరించిన వాసవి హైస్కూల్ స్టాఫ్‌ను జి.వి. ఆంజనేయులు ప్రత్యేకంగా అభినందించారు,


మిరప పంటను పరిశీలిస్తున్న ప్రియాంక

పొలాలను పరిశీలించిన రైతు సాధికార సంస్థ ప్రతినిధులు

ప్రజాశక్తి-ఈపూరు

మండల కేంద్రం ఈపూరు గ్రామంలో మహిళా రైతు నాశన పద్మావతి ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేసిన మిరప పొలాన్ని రైతు సాధికార సంస్థ రీసెర్చ్ ఫెలో బి.ప్రియాంక గురువారం పరిశీలించారు. పక్కనే రసాయనాలు వినియోగించి పండించిన మిరప పొలాలను సందర్శించారు. రైతులతో మాట్లాడి పెట్టుబడి ఖర్చుపై ఆరా తీశారు. రెండు పంటల మధ్య భేదాలను రైతులకు వివరించారు. ప్రకృతి వ్యవసాయంలో పంటలు సాగు చేసేందుకు రైతులు మొగ్గు చూపేలా ఆమె అవగాహన కల్పించారు. ప్రతి రైతు వారి ఇంటికి అవసరమైన పెరటి తోటలు పెంచుకుంటూ, ఏటీఎం, ఏ గ్రేడ్ మోడల్స్ వేసుకొని ఆరోగ్యవంతమైన ఆహార పదార్థాలు తయారు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఏ మార్కెటింగ్ ఎం మేరీ, డిఎంఎంటి భాస్కరరావు, యూనిట్ ఇన్‌ఛార్జి ఆంజనేయులు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సుధీర్, వేదికపై అతిథులు

ప్రాంగణ ఎంపికలపై శిక్షణా తరగతులు

ప్రజాశక్తి-పల్నాడు

స్థానిక శ్రీ సుబ్బరాయ, నారాయణ కళాశాలలో ఐబిఎం కంపెనీ వారిచే మూడు రోజుల పాటు ప్రాంగణ ఎంపికలలో అవలంబించాల్సిన అంశాలపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఎస్ సుధీర్ తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమంలో నేర్చుకున్న అంశాలను సద్వినియోగం చేసుకుని బహుళ జాతి కంపెనీలు నిర్వహించే ప్రాంగణ ఎంపికలలో కొలువులు సాధించాలని కళాశాల పాలకవర్గ అధ్యక్షులు కపల వాయి విజయ్‌కుమార్, సెక్రటరీ, కరస్పాండెంట్ నాగసరపు సుబ్బారాయ గుప్తా విద్యార్థులకు సూచించారు. శిక్షణా కార్య క్రమంలో ఏఐ కోర్సు, సాఫ్ట్ స్కిల్స్ నేర్పిస్తా రనీ, ఐబీఎం వారిచే సర్టిఫికెట్ ఇస్తారని తెలిపారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాస సాయి, కళాశాల ట్రైనింగ్ , ప్లేస్ మెంట్ ఆఫీసర్ డాక్టర్ ఏ.సుబ్బారావు, ఎన్ వి.రమణారావు, ఐబీఎం ట్రైనర్ ఎం.విగ్నేష్, ఎన్.దిలీప్ కుమార్ పాల్గొన్నారు.


కొర్లకుంటలో పర్యటిస్తున్న కోటేశ్వరరావు

కర్లకుంటలో గోనుగుంట్ల కోటేశ్వరరావు పర్యటన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రొంపిచర్ల మండలం కర్లకుంట గ్రామంలో గురువారం రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు పర్యటించారు. గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన టిడిపి నాయకులు తాడపనేని రామ్‌ప్రసాద్ తండ్రి మల్లయ్య దశదినకర్మ కార్యక్రమంలో పాల్గొని ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. గ్రామంలో టిడిపి విస్తరణకు, గ్రామాభివృద్ధికి మల్లయ్య చేసిన సేవలను కొనియాడారు. తెలుగు యువత రాష్ట్ర నాయకులు వడ్లమూడి వెంకట కిషోర్, మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ లింగా వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ పొనుగోటి రామారావు, టిడిపి మండల నాయకులు మందలపు వెంకటరత్నం, శాఖమూరి రామ్మూర్తి, ఆదిబాబు, పాల్గొన్నారు.


కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న జీ.వీ. ఆంజనేయులు

రమావత్ హైమా నాయక్ కుటుంబానికి జీవీ పరామర్శ

ప్రజాశక్తి - వినుకొండ

ప్రమాదవశాత్తు ట్రాక్టర్ అదుపుతప్పి మృతి చెందిన రైతు రమావత్ హైమానాయక్(45) కుటుంబాన్ని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు గురువారం పరామర్శించారు. అన్నివిధాలుగా అండగా ఉంటాం, అధైర్య పడొద్దన్నారు. వినుకొండ నియోజకవర్గం బొల్లాపల్లి మండలం హనుమాపురం గ్రామంలో ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో రమావత్ హైమా నాయక్ ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదవశాత్తు జరిగిన ఈ ఘటనతో దిక్కు తోచనిస్థితిలో పడిన రైతు కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు చీఫ్‌విప్ జీవీ. వినుకొండ ప్రభుత్వ ఆస్పత్రిలో హైమానాయక్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబసభ్యులతో మాట్లాడి ప్రమాదానికి గల కారణాలను తెలుసుకుని ఓదార్చారు. అవకాశం ఉన్న మేరకు అన్ని మార్గాల్లో వారిని ఆదుకునే ప్రయత్నం చేస్తామని తెలిపారు.


శిక్షణలో అంగన్‌వాడీలు

భాషాభివృద్ధిపై అంగన్వాడీలకు శిక్షణ

ప్రజాశక్తి - పెదకూరపాడు

అంగన్వాడీ కార్యకర్తలకు గురువారం శారీరిక, భాషాభివృద్ధిపై జ్ఞాన జ్యోతి పేరుతో శిక్షణా తరగతులు నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ కార్యక్రమం జరిగింది. మండల విద్యాశాఖాధికారి సత్యనారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేవీ రమణ, ఐసిడిఎస్ సూపర్వైజర్ షేక్ మున్ని, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు. కార్యకర్తలకు మెటీరియల్ అందించారు.

యడ్లపాడు : మండలంలోని జగ్గాపురం లింగారావుపాలెం గ్రామాల్లో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం మూడో రోజు గురువారం కొనసాగింది. ఇందులో భాగంగా అంగన్వాడీ కార్యకర్తలకు జిల్లా సమన్వయకర్తలు నో కాస్ట్-లోకాస్ట్‌తో విద్య సామాగ్రి రూపొందించే అంశాలపై అవగాహన కల్పించారు.

తాగుబోతులకు అడ్డాగా పొలాలు

ఖాళీ సీసాలను ఏరుకోవాల్సిన దుస్థితిలో రైతులు



మందుబాబులకు అడ్డాగా మారిన పొలాలు



మందుబాబులు వదలిన మద్యం సీసాలు

ప్రజాశక్తి- తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలో సుందరయ్య నగర్‌లో ఉన్న 40 అడుగుల రోడ్డు, వివిధ ప్రాంతాల్లో పంట పొలాల మధ్య ఉన్న బార్లు, వైన్‌షాపులు మందుబాబులకు అడ్డాగా మారాయి. మందుబాబులు రాత్రివేళ విచ్చలవిడిగా మద్యం సేవించి ఖాళీ సీసాలను పంట పొలాల్లో వదిలేసి వెళు తుండడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తు న్నారు. పరిస్థితి ఏ విధంగా ఉందంటే మందుబాబులు తాగిన సీసాలను ఉదయాన్నే పొలాలకు వచ్చిన రైతులు ఏరి పారేసుకోవాల్సి వస్తోంది. గుంపులు గుంపులుగా రాత్రి పూట వైన్‌షాప్‌లో ఉన్న ప్రాంతంలో తిరుగుతూ మత్తులో ఊగిపోతున్నారు. ఆ మార్గంలో రాత్రివేళ మహిళలు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. అది ఒక నిషేధ రాతిరి లాగా (వీధి) స్థానిక ప్రజలు భయాందోళనకు గురవు తున్నారు. ప్రభుత్వం ప్రజల చేత ఇబ్బడి ముబ్బడిగా తాగించటానికి, ఎక్కడబడితే అక్కడ అనుమతులు ఇవ్వడం పట్ల తాడేపల్లి పట్టణ ప్రజల సంక్షేమ సంఘం ప్రతినిధులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఎక్సైజ్ అధికారులు ఇప్ప టికైనా స్పందించి పంట. పొలాల మధ్య ఉన్నబార్, వైన్ షాపులను, జనావాసాలు, పంటపొలాల మధ్య నుంచి తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

మంచి నాయకుడిని ఎన్నుకోవాలి

ప్రజాశక్తి - దుగ్గిరాల

మంచి సమాజం కోసం మంచి నాయకుడిని ఎన్నుకో వలసిన అవసరం ఉన్నదని డిప్యూటీ కలెక్టర్ ఏ,లక్ష్మీకుమారి అన్నారు. స్థానిక కొత్త రఘురామయ్య మెమోరియల్ డిగ్రీ కళాశాలలో గురువారం జరిగిన ఏపీ లెజిస్లేటివ్ కౌన్సిల్ గ్రాడ్యుయేట్స్ ఎలక్షన్ 2025 సీప్ ఓటర్ల అవగాహన కార్య క్రమంలో ఆమె మాట్లాడారు. ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని చెప్పారు. అనంతరం ప్రతిజ్ఞ చేయిం చారు. కార్యక్రమంలో స్థానిక తహశీల్దార్ ఐసునీత ఆర్ఐ త్రివేణి నోడల్ ఆఫీసర్ కె.సంజీవరావు, కళాశాల ప్రిన్సిపల్ క్రొత్త గిరిధర్‌రావు, రమాదేవి డి.రాంబాబు పాల్గొన్నారు.



పవన్‌కుమార్‌ను అభినందిస్తున్న మానవత సభ్యులు

తూనుగుంట్ల పవన్‌కుమార్‌ను అభినందించిన 'మానవత'

ప్రజాశక్తి - తెనాలి

ఇటీవల విడుదలైన జేఈఈ మెయిన్స్ ఫలితాలలో పట్టణంలోని వివేక జూనియర్ కళాశాలలో చదువుతున్న తూనుగుంట్ల పవన్ కుమార్ 99.37 శాతం మార్కులతో జాతీయస్థాయిలో ప్రతిభ కనబరిచిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పట్టణానికి చెందిన మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం పవన్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ డాక్టర్ కొలసాని రాంచంద్ మాట్లాడుతూ అతి సాధారణ మైన కుటుంబంలో జన్మించి కష్టపడి చదివి ఉత్తమ ఫలితాన్ని సాధించిన పవన్‌కుమార్‌ను విద్యార్థులు ఆద ర్శంగా తీసుకోవాలన్నారు. విద్యార్థికి నూతన వస్త్రాలు, మొబైల్ ఫోన్ బహూకరించి అభినందించారు. కార్య క్రమంలో ఓంకార్ ప్రసాద్, కార్యదర్శి వెంకట్, పివాసు, డివిఎల్ సోమయ్య శాస్త్రి, ఎస్ వి శర్మ, సాంబశివరావు, ఏ వెంకటరామయ్య, రాజశేఖర్ రెడ్డి, రోహిణి, మురళి, మల్లీశ్వరి పాల్గొన్నారు.

సచివాలయంలో తహశీల్దార్ తనిఖీ

ప్రజాశక్తి - తెనాలి



రికార్డులు తనిఖీ చేస్తున్న తహశీల్దార్

ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలకు జవాబుదారీగా సిబ్బంది వ్యవహరించాలని తహసీల్దార్ కెవి గోపాల కష్ణ చెప్పా రు. రూరల్ పరిధిలోని బుర్రిపాలెం గ్రామంలో సచివాలయాన్ని గురు వారం పరిశీలించారు. అర్జీలకు సంబంధించి సిబ్బంది నిర్వహిస్తున్న రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సచివాలయం సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రజల నుంచి స్వీకరించిన అర్జీకి రికార్డు నిర్వహించి పరిష్కారానికి సంబంధిత అధికారులకు నిర్ణీత గడువులోగా పంపాలన్నారు. కార్యక్రమంలో సచివా లయం సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఆర్ఎంలో నూతన బి.కామ్ కోర్సులు ప్రారంభం



జ్యోతిని వెలిగిస్తున్న సీఈవో రుహెబీర్ సింగ్



కార్యక్రమానుద్దేశించి మాట్లాడుతున్న రుహెబీర్ సింగ్

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ మేనేజ్ మెంట్ కోర్సు లను విస్తృత పరుస్తోంది. ఇందులో భాగంగా గురువారం రెండు కొత్త బి.కామ్ కోర్సులను ప్రారంభించింది. సీఏ ఇంటిగ్రేటెడ్ బీకామ్‌తో పాటు ఫింటెక్ అండ్ బ్యాంకింగ్ సబ్జెక్టులతో కూడిన రెండు బి.కామ్ స్పెషలైజేషన్లను ప్రారంభించింది. గురువారం నుంచి యూనివర్సిటీలో 'అమేయ' పేరిట రెండురోజుల పాటు బిజినెస్ ఫెస్ట్ జరుగు తోంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని యూనివర్సిటీ లోని పారి బిజినెస్ స్కూల్' నూతన బి.కామ్ కోర్సులను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది. తాత్విక్ గ్లోబల్ ఎనలికల్ సంస్థ సీఈవో రుహెబీర్ సింగ్ ముఖ్య అతిథిగా హాజరై కోర్సులను ప్రారంభించారు. కోర్సుల ప్రారంభ సభలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య మనోజ్ కుమార్ ఆరోరా యూనివర్శిటీ ప్రగతిని వివరించారు. విశిష్ట అతిథిగా హాజరైన బార్ క్లేస్ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ బాల అయ్యర్, ఐసీఏఐ బ్యాంక్ విజయవాడ బ్రాంచ్ ప్రెసిడెంట్ సీఏ రవికిషోర్లు ప్రసంగించారు. 2025 విద్యా సంవత్సరం నుంది ఈ కోర్సుల్లో అడ్మిషన్లు జరుగుతాయని పారి బిజినెస్ స్కూల్ డీన్ డాక్టర్ భరద్వాజ్ శివకుమారన్ పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఎస్ఆర్ఎం యూనివర్సిటీ. వెబ్ సైట్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ప్రేమ్‌కుమార్, కామర్స్ డిపార్ట్మెంట్ హెడ్ డాక్టర్ ఏ లక్ష్మణరావు పాల్గొన్నారు.

పేదల గృహాలకు మరమ్మతులు చేసి రక్షణ కల్పించండి



వినతిపత్రం అదజేస్తున్న బాధతులు, న్యాయవాది నాగరాజు

ప్రజాశక్తి - మంగళగిరి

దశాబ్ద కాలం కింద ప్రభుత్వ పథకం కింద పేదలు నిర్మించుకున్న పక్కా గృహాలకు మరమ్మతు చేపట్టి రక్షణ కల్పించాలని ఆంధ్రప్రదేశ్ లీగల్‌సెల్ కన్వీనర్, హైకోర్టు న్యాయవాది, చిలువూరు నాగరాజు బాధితులతో కలిసి ఏపీ మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవికి వినతి పత్రాన్ని అందజేశారు. దుగ్గిరాల మండలం చిలువూరు గ్రామస్తులు గురువారం తాడేపల్లిలో శ్రీదేవి కలిశారు. సమస్యను ఆమె దృష్టికి తీసుకెళ్లినట్లు నాగరాజు మాదిగ తెలి పారు. ముఖ్య మంత్రిచంద్రబాబు గృహాలకు మరమ్మతులు చేపట్టి పేదలకు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

సబ్సిడీ రుణాలు ఇచ్చి ఆర్థికంగా ఆదుకోవాలి

చిలువూరు గ్రామంలో ఎస్సీ మాదిగ సామాజిక వర్గానికి చెందిన రోజువారి కూలీ పని చేసుకునే సుమారు వందమంది మహిళలు సబ్సిడీ రుణాలు మంజూరు చేసి కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. పేద మహిళలకు సబ్సిడీ పారిశ్రామిక రుణాలు మంజూరు చేసి వారి అభివృద్ధికి తోడ్పడాలని నాగరాజు మాదిగ విజ్ఞప్తి చేశారు. అర్హులైన అందరికీ రుణాలు మంజూరు చేస్తానని ఉండవల్లి శ్రీదేవి హామీ ఇచ్చినట్లు నాగరాజు మాదిగ తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ స్టేట్‌లీడర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ నలుకుర్తి కోటేశ్వ రరావు మాదిగ, గుంటూరు జిల్లా నాయకులు కాసుకుర్తి నవీన్ మాదిగ, కుక్క మల్ల శేఖర్ మాదిగ, కనపాల బాజీ మాదిగ, కోడూరి అరవింద్‌మాదిగ, మల్లవరపు రాహేల్, నన్నేపాగా జ్యోతి, శృంగారపాటి సుస్మిత, కొండూరు కీర్తి, చిలువూరి జోష్మి, చిలువూరి అన్నపూర్ణ, ఆళ్లహారిక, చిలు వూరు రజిని, నన్నేపాగా ప్రాణమ్మ, శృంగారపాటి అమర జ్యోతి పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సమావేశం - పలు తీర్మానాలు ఆమోదం

ప్రజాశక్తి - మంగళగిరి



సమావేశంలో పాల్గొన్న రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మంగళగిరి సబ్ బ్రాంచ్ తృతీయ వార్షిక సర్వసభ్య సమావేశము గురువారం లిటిల్ విలేజ్‌లోని హాల్‌లో నిర్వహించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మంగళగిరి సబ్ బ్రాంచ్ చైర్మన్ అనిల్ చక్రవర్తి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశములో 2023-24 వార్షిక నివేదిక, 2023-24 ఆర్థిక సంవత్సర ఆర్థిక నివేదిక, 2025-26, 2026-27 సంవత్సరముల ప్రణాళికలను, మంగళగిరి పరిసర ప్రాంత ప్రజలకు రెడ్ క్రాస్ అందిం చవలసిన సేవలపై పలు తీర్మానాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించినట్లు అనిల్ చక్రవర్తి తెలియజేశారు. సమా వేశంలో ఇండియన్ రెడ్ క్రాస్స్ సొసైటీ మంగళగిరి సబ్ బ్రాంచ్ వైస్ చైర్మెన్ గాజుల శ్రీనివాస రావు, ట్రెజరర్, సెక్రె టరీ అందె మురళి, కార్యవర్గ సభ్యులు షేక్ శిలార్, గుంటి నాగరాజు, రెడ్ క్రాస్ సభ్యులు ప్రెగడ రాజశేఖర్, పారేపల్లి నిరంజన్ గుప్తా, అందె రేవంత్, కందుల నాగార్జున, బట్టు వేంకటేశ్వర రావు పాల్గొన్నారు.



బహుమతులు ప్రదానం చేస్తున్న ఈదర పూర్ణచంద్, డాక్టర్ షైనీ

ముగిసిన హ్యాండ్‌బాల్ పోటీలు

ప్రజాశక్తి-తెనాలిరూరల్

స్థానిక సుల్తానాబాద్ జెయంజె కళాశాలలో నిర్వహించిన అంతరకళాశాలల మహిళ హ్యాండ్ బాల్ పోటీలు గురువారంతో ముగిశాయి. హెూరాహెూరీగా సాగిన ఫైనల్స్ పోటీలో జెయంజె, ఎఎస్ఎన్ కళాశాలలు తలపడగా జెఎంజె కళాశాల విజేతగా నిలిచింది. రన్నరప్ గా తెనాలి ఎఎస్ఎన్ కళాశాల నిలవగా మూడవ స్థానం బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలకు దక్కింది. హ్యాండ్ బాల్ సంఘం ప్రెసిడెంట్ ఈదర వెంకట పూర్ణచంద్ హ్యాండ్ బాల్ కోచ్ నాగరాజు విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు.ఇతర జిల్లాల నుండి పలువురు వచ్చిన క్రీడాకారులు ఈ హ్యాండ్ బాల్ పోటీల్లో పాల్గొన్నారు. ఫిజికల్ డైరెక్టర్లు వేలాంగిళిణి రెడ్డి, రవీందర్, కాలేబ్, ప్రేమ్ కుమార్, డాక్టర్ సుశీలమ్మ, నాగమల్లేశ్వరరావు తదితరులు విజేత లను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్‌షైనీ, ఫిజికల్ డైరెక్టర్ అరుణ సుజాత పాల్గొన్నారు.



విద్యార్థులతో మురళి కాంత్, గీతా కాంత్

ఇంటర్ విద్యార్థుల వీడ్కోలు వేడుకలు

ప్రజాశక్తి - తెనాలి : స్థానిక బోస్ రోడ్‌లోని నెహ్రూ నికేతన్ జూనియర్ కళాశాలలో సీనియర్ ఇంటర్ విద్యార్థుల వీడ్కోలు వేడుకలు గురువారం నిర్వహించారు. విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ మురళీకాంత్ దాసరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గీతాకాంత్ పర్యవేక్షణలో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలలో పాలొ న్నారు. ఈ సందర్భంగా మురళికాంత్ మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్య సాధన కోసం ముందడుగు వేయాలన్నారు. సామాజిక మాధ్యమాల ప్రభావానికి దూరంగా ఉండాలన్నారు. గీతాకాంత్ మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదల అంకితభావంతో ముంద డుగు వేయాలన్నారు. వివిధ రకాల పోటీలలో ప్రతిభ కనబరి చిన విద్యార్థులకు మెమెంటోలను బహూకరించారు. అనంతరం మేనేజింగ్ డైరెక్టర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌ను అధ్యాపకులతో కలసి విద్యార్థులు సత్కరించారు.



దీక్షల్లో కూర్చున్న కార్మికులు

ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను పరిష్కరించండి

ప్రజాశక్తి- తాడేపల్లి

సమస్యల పరిష్కారానిక ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు గురువారానికి 78వ రోజు చేరు కున్నాయి. దీక్షలను సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, ఐఎఫ్‌టియు నాయకులు కే ఆదినారా యణ ప్రారంభించారు. దీక్షలో బి నవనీతం, ఎం శారద, డి రమణ, కె బుజ్జి, రిబ్కా కూర్చున్నారు. నాయకులు మాట్లా డుతూ పంతాలు పట్టింపులకు పోకుండా చర్చల ద్వారా సానుకూలమైన వాతావరణంలో కార్మికులకు న్యాయం జరిగే విధంగా చూడాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, బి.సూర్యప్రకాష్, బి అంక య్య, రమాదేవి, భవాని, గురవయ్య పాల్గొన్నారు.

డాక్టర్ వసంతరావుకు ఇన్నోవేటివ్ టీచర్ అవార్డు

ప్రజాశక్తి - ఎఎన్‌యు



ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని విద్యా విభాగంలో అతిథి ఆధ్యాపకునిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ఎం. వసంతరావుకు బెస్ట్ ఎడ్యుకేటెడ్ ఇన్నోవేటివ్ టీచర్ అవార్డు 2025 లభించింది. గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లో ఉన్న జర్నల్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ సంస్థ ప్రకటించిన ఈ అవార్డుల్లో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుండి డాక్టర్ వసంతరావుకు లభించింది. ఈ సందర్భంగా ఇన్చార్జి విసి ఆచార్య కే గంగాధర రావు, ఇన్చార్జి రెక్టర్ ఆచార్య కే. రత్న షీలా మణి, ఇన్చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎం .సురేష్ కుమార్,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఆచార్య దివ్య తేజో మూర్తి, దూరవిద్య కేంద్రం పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య రామచంద్రన్ తదితరులు వసంతరావును అభినందించారు. ఇటువంటి పరిశోధన అవార్డులు భవిష్యత్తులో మరిన్ని పొంది, వర్సిటీ పేరుప్రతిష్టలు పెంచాలని కోరారు.

ఉద్యోగ నైపుణ్యాలపై కిట్స్ అక్షర్‌లో అవగాహన సదస్సు

ప్రజాశక్తి-గుంటూరు



మాట్లాడుతున్న సురేష్ నర్రా

యనమదలలోని కిట్స్ అక్షర్ ఇన్‌స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీలో బి.టెక్ ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులకు విద్యార్థులకు ప్రముఖ కంపెనీ అయిన ఇన్ఫోసిస్ విశాఖపట్నం బ్రాంచ్ హెడ్ సురేష్ నర్రా ఆధ్వర్యంలో అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సురేష్ నర్రా మాట్లాడుతూ విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ ఉద్యగ కల్పనకు కావాల్సిన విధంగా ఇంజినీరింగ్ సబ్జెక్టులతోపాటు ప్రస్తుతం సాఫ్ట్‌వేర్ ఇండస్ట్రీకి కావాల్సిన నూతన కోర్సులను నైపుణ్యాలను నేర్చుకొని, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై పట్టుసాధించాలన్నారు. సమస్య పరిష్కారం, సొంతగా నేర్చుకోవటం, కొత్త విషయాలను కనుక్కోవటంపై పట్టు సాధించి, కొత్త ఆవిష్కరణలను ప్రతిపాదించాలన్నారు. విద్యార్థులకు ప్రస్తుత సాఫ్ట్‌వేర్ ఉద్యోగులపై వున్న సందేహాలను నివత్తి చేస్తు అవగాహనా కల్పించారు.ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామకోటయ్య, చైర్మన్ కోయి సుబ్బారావు, సెక్రటరీ కోయి శేఖర్, డైరెక్టర్ గోగినేని సాంబశివరావు అధ్యాపకులు పాల్గొన్నారు.

23న కెఎల్‌పి స్కూల్లో చెస్ టోర్నమెంట్

ప్రజాశక్తి-గుంటూరు



బ్రోచర్ విడుదల చేస్తున్న సెక్రెటరీ తదితరులు

స్థానిక జెకెసి కాలేజి రోడ్డులోని డాక్టర్ కెఎల్‌పి పబ్లిక్ స్కూల్ ఆధ్వర్యంలో ది ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ సహకారంతో ఈనెల 23న ఎపి స్టేట్ లెవల్ ఓపెన్ చెస్ టోర్నమెంట్ నిర్వస్తున్నట్లు పాఠశాల సెక్రెటరీ, కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ తెలిపారు. సెక్రెటరీ తోపాటు, ఏఒ వెంకట్రావు, ప్రిన్సి పాల్ జి.రత్తయ్య పోటీలకు సంబం ధించిన బ్రోచర్ ఆవిష్కరించారు. ఈటోర్నమెంట్‌లో విజేతలకు మొత్తం రూ.30వేల నగదు బహుమతిని, పిల్లలకు ప్రత్యేక బహుమతులు ఉంటాయన్నారు. ఈ టోర్నమెంట్‌కు ఈనెల 22వ తేదీలోపు పేర్లు రిజిస్ట్రేషన్‌ను నమోదు చేసుకోవాలన్నారు. ఈ టోర్నమెంట్ రిజిస్ట్రేషన్, ఇతర వివరాలకు టోర్నమెంట్ ఆర్బిటర్ ఎం.గోపినాథ్‌కు 9703049378, 9391339343 నంబర్లలో సంప్రదించాలన్నారు.

నేడు, రేపు జాతీయ సదస్సు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని సెంటర్ ఫర్ డాక్టర్ అంబేద్కర్ చైర్ ఆధ్వర్యంలో ఈనెల 21, 22 (శుక్ర, శని వారాల్లో) తేదీల్లో జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు సదస్సు డైరెక్టర్ ఆచార్య వై. అశోక్ కుమార్ తెలిపారు. అంబేద్కర్ విజన్ ఇంటర్ ప్లే ఆఫ్ సోషియో, పొలిటికల్, ఎకనామిక్ ఫ్యాక్టర్స్ ఇన్ ఇండియా అనే అంశంపై ఈ సదస్సును నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 10.30 గంటలకు వర్సిటీలోని డైక్ మన్ ఆడిటోరియంలో ఉన్న వేణుగోపాల్ రెడ్డి సెమినార్ హాల్లో సదస్సు ప్రారంభం అవుతుందని ఆయన తెలిపారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా ఇన్చార్జి విసి ఆచార్య కే. గంగాధరరావు, కీలక ఉపన్యాసకులుగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ గంట చక్రపాణి తదితరులు పాల్గొంటారని తెలిపారు.

వర్సిటీ ఫార్మసీ కళాశాలలో జాతీయ సదస్సు

ప్రజాశక్తి - ఎఎన్‌యు : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ సహకరం తో మార్చి 11, 12 తేదీ లలో జరగబోవు జాతీయ సదస్సు కరపత్రాలను విశ్వవిద్యాలయ ఇన్చార్జి వీసి ప్రొఫెసర్ కే.గంగాధరరావు ఆవిష్కరించారు. "రీసెంట్ అడ్వాన్స్మెంట్స్ ఇన్ సాఫ్ట్వేర్ బేస్డ్ అప్రోచెస్ ఇన్ ఫార్మాస్యూటికల్ రీసెర్చ్" (రసాప్-2025)లి అనే ఈ సదస్సుకి సెమినార్ డైరెక్టర్, కన్వీనర్ గా డాక్టర్ కే. విజయ్ కిషోర్ వ్యవహరించనున్నారు. ఈ సందర్భంగా విజయ్ కిషోర్ మాట్లాడుతూ "ఈ సదస్సు యొక్క ముఖ్య ఉద్దేశం ఫార్మాస్యూటికల్ రీసర్చ్ నందు సాఫ్ట్ వేర్ యొక్క ఆవశ్యకత, సాఫ్ట్ వేర్ వాడుతూ చేసే పరిశోధనల యొక్క ప్రాముఖ్యతని తెలియపరచటం" అని తెలిపారు. విద్యార్థులు, పరిశోధకులు మరియు అధ్యాపకులు ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని కోరారు. కార్యక్ర మంలో విశ్వవిద్యాలయ ఇన్చార్జి రెక్టార్ ప్రొఫెసర్ కె.రత్నశీలా మణి, ఇన్చార్జి ఓ. ఎస్.డి ఆచార్య ఆర్.వి.ఎస్ ఎస్.ఎన్ రవికుమార్ పాల్గొన్నారు.




ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి


స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలిస్తున్న ఎస్‌పి సతీష్‌కుమార్

ఎమ్మెల్సీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు : కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

బ్యాలెట్ బాక్సులకు పూర్తి భద్రత : ఎస్‌పి

ఉమ్మడి కృష్ణా, గుంటూరు పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గానికి ఈనెల 27 న జరిగే ఎన్నికలకు సంబంధించి స్థానిక ఏ.సి కళాశాలలో బ్యాలెట్ బాక్సులు భద్రపర్చే గదులు , రిసెప్షన్ సెంటర్లు , డిస్ట్రిబ్యూషన్ సెంటర్ , కౌంటింగ్ సెంటర్ ఏర్పాట్లను గురువారం జిల్లా ఉన్నతాధికారులు వేర్వేరుగా పరిశీలించారు. జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి సంయుక్త కలెక్టర్ ఏ. భార్గవ్ తేజ తో కలసి పరిశీలించి తగు సూచనలు జారీ చేశారు. ఫిబ్రవరి 26 వ తేదీన పోలింగ్ మెటీరియల్‌ను పోలింగ్ సిబ్బందికి సక్రమంగా అందించేందుకు ఏర్పాట్లను చేయాలన్నారు. ప్రధానంగా డిస్ట్రిబ్యూషన్ కౌంటర్ల వద్ద బోర్డులను ఎన్నికల సిబ్బంది గుర్తించే విధంగా ఏర్పాటు చేయాలన్నారు. పోలింగ్ మెటీరియల్ తీసుకున్న తరువాత వారిని పోలింగ్ కేంద్రాలకు సురక్షితంగా చేర్చేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. డిస్ట్రిబ్యూషన్ , రిసెప్షన్ కౌంటర్ల వద్ద ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి అల్పాహారం, మంచినీరు, శుభ్రమైన భోజనం అందించాలని సూచించారు. ఓటింగ్ అనంతరం పోలింగ్ బూత్ ల నుండి తీసుకువచ్చిన బ్యాలెట్ బాక్సులను నిబంధనల ప్రకారం సురక్షితంగా భద్రపరచెందుకు పకడ్బంధీ చర్యలు తీసుకోవాలన్నారు. వాహనాల పార్కింగ్ కు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలన్నారు. డిస్ట్రిబ్యూషన్ మరియు రిసెప్షన్ కౌంటర్ల వద్ద మంచి గాలి , వెలుతురు వుండేటట్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా బ్యాలెట్ కౌంటింగ్ కు సంబంధించి ఏ.సి కాలేజీ లోని ప్రేయర్ హాల్ నందు ఏర్పాటు చేసిన కౌంటింగ్ టేబుళ్లను పరిశీలించి తగు సూచనలు జారీ చేశారు. జిల్లా రెవెన్యూ అధికారి షేక్. ఖాజావలి , ఆర్డిఓ కె. శ్రీనివాస రావు, ల్యాండ్ అండ్ సర్వే శాఖ ఏ.డి పవన్ కుమార్, గుంటూరు తూర్పు, పశ్చిమ మండల తహశీల్దార్లు నగేష్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూముల వద్ద కట్టుదిట్టమైన భద్రత : ఎస్‌పి

ఎమ్మెల్సీ ఎన్నికల బ్యాలెట్ బాక్సులను భద్రపరచడానికి స్థానిక ఎసి కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములను జిల్లా ఎస్‌పి సతీష్ కుమార్, పోలీస్ రెవెన్యూ అధికారులు గురువారం పరిశీలించారు. కళాశాలలో మొత్తం 4 స్ట్రాంగ్ రూములను ఏర్పాటు చేయగా ఎటువంటి అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా తగిన బందోబస్తు ఏర్పాట్లపై చర్చించారు. అక్కడ ఎటువంటి బందోబస్తు ఏర్పాటు చేయాలి? ఎంత మంది పోలీస్ సిబ్బందిని కేటాయించాలన్న అంశంపై అధికారులతో మాట్లాడారు. స్ట్రాంగ్ రూముల వద్దకు వెళ్లడానికి ఎన్ని మార్గాలు ఉన్నాయి..?, బ్యాలెట్ బ్యాక్సులను తీసుకొచ్చి - తీసుకెళ్లే సమయంలో పోలీస్ అధికారులు సిబ్బంది ఎటువంటి భద్రత కల్పించాలి..? అనే వివిధ అంశాలపై పలు సూచనలుచేశారు. రెవిన్యూ శాఖ తరపున చేసే ఏర్పాట్ల గురించి ఆరా తీసి, పోలీస్, రెవిన్యూ శాఖ అధికారులు సమన్వయం చేసుకుంటూ స్ట్రాంగ్ రూములలో భద్రపరుస్తున్న బ్యాలెట్ బాక్సుల భద్రత విషయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని, పోలీస్ శాఖ తరపున తగినంత మంది సిబ్బందిని స్ట్రాంగ్ రూము బందోబస్తు నిమిత్తం కేటాయిస్తామని ఎస్‌పి తెలిపారు. ఎస్‌పి వెంట అదనపు ఎస్‌పిలు జి.వి.రమణ మూర్తి, హనుమంతు, డిఎస్‌పి ఏడుకొండలు, తూర్పు, పశ్చిమ తహశీల్దార్లు గణేష్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ ఆన్స్‌లో ప్రాంగణ ఎంపికలు

ప్రజాశక్తి-గుంటూరు


ఎంపికైన సెయింట్‌ఆన్స్ కళాశాల విద్యార్థినులతో ప్రిన్సిపల్, కంపెనీ ప్రతినిధులు

స్థానిక గోరంట్లలోని సెయింట్ ఆన్స్ మహిళా కాలేజిలో డిగ్రీ తృతీయ సంవత్సరం విద్యార్థినులకు టెక్‌బిఎం సాఫ్ట్‌వేర్ కంపెనీ ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. విద్యార్థినులకు టైపింగ్, మౌఖిక పరీక్షలు నిర్వహించి 17 మంది విద్యార్థినులను ఎంపిక చేసినట్లు కంపెనీ హెచ్‌ఆర్ టి.వాసవి, వి.సుష్మ తెలియజేశారు.ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థినులను కళాశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ సిస్టర్ టి.సంధ్య, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ జె.ప్రతాప్‌రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

మాదకద్రవ్యాలను అరికట్టేందుకు విద్యాసంస్థల్లో కమిటీలు

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో మాదక ద్రవ్యాల వినియోగాన్ని పూర్తిస్థాయిలో అరికట్టేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్‌తో కలసి నార్కోటిక్ కోఆర్డినేషన్ కమిటీ జిల్లా స్థాయి సమావేశంలో పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ గంజాయి, ఎండీఎం, కోకైన్ వంటి మాదక ద్రవ్యాలు ఎక్కువుగా 18 నుంచి 24 ఏళ్ల వయస్సు వారు తీసుకుంటున్నారని, జిల్లాలోకి అక్కడక్కడ మాదక ద్రవ్యాల వినియోగం, అమ్మకాలపై కేసులు సైతం నమోదు చేయటం జరుగుతుందన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు పర్యవేక్షణకు అంతర్గతంగా ప్రత్యేకంగా కమిటీలను పదిహేను రోజుల్లో ఏర్పాటు చేసేలా విద్యా శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కమిటీలు మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల దుష్పరిణామాలను వివరిస్తూ ఆయా విద్యాసంస్థల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. మత్తు పదార్థాల అమ్మకాలు, వినియోగించేవారు సమాచారం తెలిపేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన 14405 టోల్‌ఫ్రీ నెంబరునుకు విస్తృత స్థాయిలో ప్రచారం కల్పించాలన్నారు. యూనివర్సిటీలలోను విద్యార్థులు మాదకద్రవ్యాల వినియోగించకుండా యాజమాన్యాలు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్పీ సతీష్‌కుమర్ మాట్లాడుతూ జిల్లాలో మాదక ద్రవ్యాల వినియోగించటానికి అనువుగా ఉన్న జనసంచారం లేని ప్రాంతాలను మండలాల వారీగా గుర్తించి పూర్తిస్థాయిలో నిఘా ఉంచి పర్యవేక్షించటం జరుగుతుందన్నారు.ఇటీవల జిల్లా పోలీసు యంత్రాంగం గంజాయి, ఎండీఎం వంటి మాదక ద్రవ్యాలను అమ్మకాలు చేస్తున్న, వినియోగిస్తున్న వారిని పట్టుకొని, వారి మూలాలను వెలికి తీసి ఎక్కువ మంది ముద్దాయిలపై కేసులు నమోదు చేయటం జరిగిందన్నారు. గతంలో విద్యార్థులు మాదక ద్రవ్యాలు వినియోగిస్తే వారి తల్లిదండ్రులు కౌన్సిలింగ్ పిలిచి హెచ్చరించి వదిలివేసేవారమని, వారు తిరిగి మాదక ద్రవ్యాలు వినియోగిస్తుడటంతో ప్రస్తుతం విద్యార్థులైన మాదక ద్రవ్యాలు వినియోగిస్తు పట్టుబడితే కేసులు నమోదు చేయటం జరగుతుందన్నారు. సమావేశంలో డిఆర్‌ఒ ఖాజావలి, ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ అరుణకుమారి, డిఆర్‌డిఎ పీడీ విజయలక్ష్మి, డిఇఒ రేణుక, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


అధికారులతో కలెక్టర్ సమావేశం